టీడీపీలో మహాజోష్



- కలిసికట్టుగా పనిచేసిన నేతలు
- మహానాడు సక్సెస్‌తో పెరిగిన ఆత్మవిశ్వాసం
- జిల్లా అభివృద్ధికి చంద్రబాబు రోడ్ మ్యాప్
- జిల్లా వాసుల్లో చర్చ
- నేతలకు అభినందనలు.. కార్యకర్తలకు హ్యాట్సాఫ్
- టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



టీడీపీలో మహాజోష్ నెలకొంది. మూడురోజుల పాటు కడపలో నిర్వహించిన మహానాడు.. ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో భారీ సక్సెస్ కావడం.. మహానాడు సాక్షిగా జిల్లా అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు రోడ్‌మ్యాప్ ప్రకటించి.. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న స్టీలుప్లాంటు ఇతర వాటిని పూర్తిచేస్తామని అశేష జనవాహిని సాక్షిగా హామీ ఇవ్వడం.. సీఎంతో సహా మంత్రి నారాలోకేశ్ అభినందించడంతో టీడీపీ నేతల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మహానాడు విజయవంతం కావడంపై శుక్రవారం చంద్రబాబునాయుడు టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులను, నేతలను అభినందించారు. ఇది ఉమ్మడి జిల్లా నేతల్లో మరింత జోష్ నింపింది.

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో మహానాడు నిర్వహించాలని అనుకున్నప్పుడు కొందరు టీడీపీ నేతలు పెదవివిరిచారు. అంత కార్యక్రమం ఇక్కడ నిర్వహించగలమా, వచ్చినవారికి వసతి ఎలా అని అనుకుంటూ వచ్చారు. అందుకు తగ్గట్టుగా నాయకుల మధ్య సమన్వయలోపం ఉండేది. అయితే సీఎం చంద్రబాబునాయుడు మహానాడును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, మంత్రుల బృందం ఇతర ముఖ్య నేతలు కడపలో మకాం వేయడంతో వారి సమన్వయంతో జిల్లా నాయకత్వం తిరుగులేని ఏర్పాట్లు చేసి శభాష్. అనిపించుకుంది. చివరి రోజు నిర్వహించిన బహిరంగసభ అయితే నభూతో నభవిష్యత్‌గా సాగింది. కడపజిల్లా చరిత్రలో ఏ పార్టీకి ఇంత స్థాయిలో జనం బహిరంగసభకు రాలేదు. బహిరంగసభకే సుమారు 4 లక్షల మంది పైచిలుకు హాజరయ్యారని అంచనా. ఈ జనాలను చూసి వేదికపై ఉన్న సీఎం, లోకేశ్‌తో సహా అందరూ సంబరపడ్డారు. ఇటు చెన్నూరు వైపు, ఇటు పులివెందుల రోడ్డు, అటు రిమ్స్ రోడ్డు, రాయచోటి రోడ్డు, రాజంపేట రోడ్డుల్లో భారీ స్థాయిలో వాహనాలు నిలబడిపోయి ట్రాఫిక్ జామ్ అయి సభావేదిక వద్దకు చేరుకోలేక పోయారు. ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తోంది. ఇంకా తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు అమలు కాలేదు. ఈ నేపథ్యంలో నిర్వహించిన మహానాడు బహిరంగసభ ఇంత పెద్ద ఎత్తున విజయవంతం కావడం విశేషం.

కలిసికట్టుగా..

మహానాడు నిర్వహణ కోసం జిల్లా నాయకత్వం సమష్టిగా పనిచేసింది. సీకేదిన్నె మండలంలోని పబ్బాపురంలో నిర్వహించడంతో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి వేదిక నిర్వహణ బాధ్యతలను భుజంపై వేసుకున్నారు. అక్కడ స్థలాల యజమానులు, రైతులతో మాట్లాడి వారిని ఒప్పించారు. మహానాడు సందర్భంగా మంత్రి నారాలోకేశ్ చైతన్యను చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి పదిహేను రోజులు మహానాడు వేదిక కోసం బాగా కష్టపడ్డారు. స్థలం మొదలు రైతులను ఒప్పించడంలో అన్నింటిలో ముందుండి రేయింబవళ్లు పనిచేశారని చెప్పగా.. తెలుసు తెలుసు నా రిపోర్టు నాకుందంటూ చైతన్యను చంద్రబాబు అభినందించారు. ఇక జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి, రితీశ్‌కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, ఇతర నేతలంతా ఏకధాటిగా పనిచేశారు. వేదిక ఇతర పనులంతా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, కన్నబాబు మరికొందరు అక్కడే మకాం వేసి ఏర్పాట్లు చూశారు.

కార్యకర్తలకు హ్యాట్సాఫ్

"కడప మహానాడు అద్భుతంగా జరిగింది. జిల్లా నేతలంతా కలిసి సక్సెస్ చేశారు. సక్సెస్ చేసిన నేతలకు అభినందనలు. కార్యకర్తలకు నా హ్యాట్సాఫ్" అని చంద్రబాబు జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. ఈ మేరకు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. "నాయకత్వం సమష్టిగా పనిచేస్తే ఏ కార్యక్రమం అయినా సజావుగా సాగుతుందని కడప మహానాడు నిరూపితమైంది. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారు. మహానాడుకు ప్రజలు స్వచ్ఛందంగా రావడం సంతోషం ఇచ్చింది. మహానాడులో ప్రవేశపెట్టిన ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని సూచించారు.

అభివృద్ధిపై రోడ్‌మ్యాప్

మహానాడు వేదికపై ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి చంద్రబాబు వరాలజల్లు కురిపించారు. కడపలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం పనులు జూన్ 12లోపే మొదలుపెడతామని హామీ ఇచ్చారు. ఇక జగన్ హయాంలో తెగిన అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు నగరికి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు సభ సాక్షిగా చంద్రబాబు ప్రకటించారు. ఇది పూర్తయితే...

- మిగతా 4వ పేజీలో

వైభవంగా సీతారాముల కల్యాణం

- తిరుచ్చిపై ఉత్సవమూర్తుల నగరోత్సవం



తిరుచ్చిపై సీతారామలక్ష్మణుల నగరోత్సవం

వాల్మీకిపురం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామాలయం లో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణతో సీతారాముల కల్యాణం చేశారు. సాయంత్రం తిరుచ్చిపై ఊరేగించారు. వేడుకలలో పాల్గొన్న దంపతులకు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, ధనుష్, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: డీఆర్‌వో



యోగా చేస్తున్న అధికారులు

ఒంటిమిట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అన్నారు. శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం పార్కులో యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు సామూహికంగా యోగా చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఎంహెచ్‌వో నాగరాజు, డీపీవో రాజ్యలక్ష్మీ, ఏపీ టూరిజం అధికారి సురేష్‌కుమార్, ఆయుష్, డాక్టర్ మురళి, దేవాదాయశాఖాధికారి మల్లికార్జున, స్పోర్ట్స్ అధికారి జగన్నాథరెడ్డి, కడప హరిత హోటల్ మేనేజర్ మల్లికార్జునగౌడ్, మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపీపీ నల్లగొండ లక్ష్మీదేవి, ఎంపీడీవో గౌస్‌బాషా, తహసీల్దారు రమణమ్మ, మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, ఎంపీపీ ప్రతినిధి నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి, మాజీ కో ఆప్షన్‌మెంబర్ షేక్.అజమతుల్లా, ఈవోపీఆర్డీ ప్రసాద్, డీటీ గౌరి, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డుకు మోక్షం

- రూ.4.03 కోట్లు మంజూరు

బి.కొత్తకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుకు మోక్షం లభిస్తోంది. చుట్టుపక్కల జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు హిల్స్ పర్యటనకు వస్తుంటారు. హిల్స్‌పై చూడముచ్చటైన ప్రదేశాలు చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికీ రోడ్డు సరిగాలేదని పర్యాటకులు వాపోతుండేవారు. వైసీపీ హయాంలో హిల్స్ రోడ్డు పనులను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పీకేఎం ఉడా ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. అదేవిధంగా దిగువన మదనపల్లె-బి.కొత్తకోట రోడ్డు నుంచి హార్సిలీహిల్స్ పైకి వెళ్లే 10 కి.మీ.ల ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం రోడ్లు భవనాల శాఖ నుంచి రూ.4.03 కోట్ల నిధులు విడుదలయ్యాయి. టెండర్లు కూడా పిలిచారు. ఈ నిధులతో ఘాట్‌రోడ్డు మొత్తం ఒక లేయర్ రోడ్డు వేయడంతో పాటు, బాగా దెబ్బతిన్న చోట పిట్టగోడను సైతం మరమ్మతు చేయిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణరెడ్డి వివరించారు.

గజగజ వణుకుతున్న పీలేరు !



- పోలీసులు, ఫారెస్టు సిబ్బంది అప్రమత్తం

వివరాలు 4లో...

మామిడి వ్యాపారం డీలా

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న జ్యూస్ పరిశ్రమలు
- నష్టాల కడలిలో మామిడి రైతులు



వివరాలు 4లో...

స్నేహితుడి కోసం వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

- జంగావారిపల్లె సమీపంలో కారు బోల్తాపడి యువకుడు మృతి
- నలుగురికి తీవ్రగాయాలు
- మృతుడి కుటుంబీకులకు మంత్రి పరామర్శ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



మృతిచెందిన యువకుడు నవాజ్

కురబలకోట, మే 30(ఆంధ్రజ్యోతి): స్వదేశానికి వచ్చిన స్నేహితుడిని తీసుకువచ్చేందుకు వెళ్లిన యువకులు తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదంబారిన పడడంతో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. రాయచోటికి చెందిన ఖాదర్ కుమారుడు నవాజ్(24) కువైట్‌కు వెళ్లి కొద్ది రోజుల క్రితం తిరిగొచ్చాడు. అతడి స్నేహితుడు సుహైల్ కువైట్ నుంచి వస్తుండడంతో అతన్ని తీసుకొచ్చేందుకు తన స్నేహితులతో కలిసి గురువారం రాత్రి కారులో బెంగళూరుకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం కురబలకోట మండలం జంగావారిపల్లె సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవాజ్ అక్కడిక్కడే మృతి చెందాడు. మహమ్మద్ అలీఖాన్(24), ముజిమిల్(24), ఖాదర్‌ఖాన్(24), సుహేల్(24)లు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆసుపత్రికి చేరుకుని కుటుంబీకులకు సానుభూతిని తెలియజేశారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి తండ్రి ఖాదర్ కువైట్‌లో ఉన్నాడు. శనివారం జరిగే అంత్యక్రియలకు హాజరుకానున్నట్లు బంధువులు తెలిపారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



టోల్ ఫ్రీ నెంబర్ల కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, తదితర అధికారులు

రాయచోటి(కలెక్టరేట్), మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా రూపొందించడంలో అధికారులు, పోలీసుశాఖ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి అజెండా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ప్రధానంగా మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో తీసుకోవాల్సిన అంశాలను కమిటీలో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ఎవరూ బానిసలు కాకూడదని, ముఖ్యంగా యువత మేలుకొని డ్రగ్స్‌ను వదులుకోవాలని, తమ భవితను మంచిగా మలుచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, విద్య, అటవీ, డ్రగ్స్ తదితర శాఖల అధికారులు అందరూ పోలీసుశాఖతో సమన్వయం చేసుకొని మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. జిల్లాలో డ్రగ్ డీ-అడిక్షన్, పునరావాస కేంద్రాల పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి డివిజన్లలో 2024, 2025లో ఇప్పటి వరకు మొత్తం 26 డ్రగ్ కేసులను రిజిస్టర్ చేసి సుమారు 300 కిలోల గంజాయి పట్టుకున్నామని, 40 మంది నిందితులను గుర్తించామన్నారు. అలాగే 11 మంది రిటైలర్లు, 20 మంది సెల్లర్స్, 99 మంది వినియోదారులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని కళాశాలల్లో, స్కూల్స్‌లో 167 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అలాగే బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, వివిధ కూడళ్లలో హోర్డింగ్స్ ప్రచార పోస్టర్లు, కరపత్రాలు, పాంప్లెట్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం అధికారులతో కలిసి డ్రగ్స్, గంజాయి నివారణ, టోల్‌ఫ్రీ నెంబర్లపై ప్రచార కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అటవీ, వైద్య, విద్య, డ్రగ్స్ కంట్రోల్, వివిధ శాఖల అధికారులు, ఐటీఐ, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో సక్సెస్

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, చిత్రంలో వరుసగా వికాస్ హరికృష్ణ, భూపేశ్‌రెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, రామగోపాల్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, పల్లా శ్రీనివాసరావు, ఆర్.మాధవి, చమర్తి జగన్‌మోహన్‌రాజు, గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్

కడప మారుతీనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కడపలో మూడురోజులపాటు జరిగిన మహానాడు కనీవినీ ఎరుగని రీతిలో సక్సెస్ అయిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక హరిత హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లా గొప్పతనం యావత్ ప్రపంచానికి తెలిసేలా మహానాడును విజయవంతం చేసిన ఉమ్మడి కడప జిల్లా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ మహానాడు జరిగిన మూడు రోజులు కడప నగరం పసుపుమయం అయిందన్నారు. కడపలో మహానాడు జరుగుతుందనే ప్రకటన వెలువడినప్పటి నుంచి ఉమ్మడి కడప జిల్లా పార్టీ నాయకులు ఏకమై ఊహించని రీతిలో విజయవంతం చేసేందుకు శక్తికి మించి శ్రమించి సక్సెస్ చేశారన్నారు. భావితరాలకు భరోసానిచ్చేలా కూటమి పాలన సాగుతుందన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 10 ఎమ్మెల్యే స్థానాలలో ఏడుచోట్ల కూటమి నాయకులు విజయం సాధించారనే సంగతి వైసీపీ నాయకులు గమనించాలన్నారు. ఇంకా ఉమ్మడి కడప జిల్లా వైసీపీదే అనే భ్రమల్లో తేలియాడుతున్నారని ఎద్దేవా చేశారు.

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అంచనాలకు మించి మహానాడు సక్సెస్ కావడంతో ఉమ్మడి కడప జిల్లా పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పూర్తి భరోసా కలిగిందన్నారు. ఒకప్పుడు కడప జిల్లా తెలుగుదేశం పార్టీకి అడ్డాగా ఉండేదని, తిరిగి జిల్లాలో పార్టీకి పూర్వవైభవం రావడంతో నూతనోత్తేజం కలిగిందన్నారు.

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ సర్వతోముఖాభివృద్ధికి మహానాడు వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రధానంగా కడప జిల్లాతో పాటు రాయలసీమను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించనుండడంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ మహానాడు కోసం పులివెందుల సర్కిల్స్‌లో కట్టిన టీడీపీ జెండాలు, తోరణాలను కావాలని తొలగించడం సరికాదన్నారు. పులివెందుల రింగ్‌రోడ్డు చుట్టూ వైఎస్సార్ విగ్రహాలే ఉన్నాయన్నారు. కాకపోతే ఎక్కడా ఆయనకు తగిలేలా తోరణాలు కట్టలేదన్నారు. అయినప్పటికీ టీడీపీ జెండాలు, తోరణాలు కావాలనే తొలగించారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎవ్వరిపైనా కక్షసాధింపు చర్యలకు తాను పాల్పడలేదన్నారు. గతంలో తనను అక్రమంగా అరెస్ట్ చేసి ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పిన సంగతి వైసీపీ నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు.

పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడప బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచేలా మహానాడు సభ సక్సెస్ కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు జూన్ 1వ తేది నుంచి చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నెల 1వ తేది నుంచి 15వ తేది వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు చౌకదుకాణాలు అందుబాటులో ఉండి ప్రజలకు రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. 65 సంవత్సరాల పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందజేయాలని సూచించారు.

అన్నమయ్య థీమ్‌పార్కును పరిశీలించిన జేసీ



థీమ్‌పార్కును పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాజంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య థీమ్‌పార్కును జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ పరిశీలించారు. చారిత్రాత్మక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ పార్కును పరిశీలించినట్లు ఆయన తెలిపారు. శనివారం ఉదయం సౌమ్యనాథస్వామి ఆలయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అన్నమయ్య థీమ్‌పార్కులో కూడా యోగా కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఏవో బాలమునిస్వామి, చలపతి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో

భర్త యాసిడ్‌తో దాడి

సిద్దవటం, మే 30 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో గురువారం రాత్రి ఆమె శరీరభాగాలపై యాసిడ్ పోసిన ఘటన మాధవరం గ్రామ పంచాయతీ మహబూబ్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, ఎస్‌ఐ మహమ్మద్‌రఫి వివరాల మేరకు... మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ లాల్ మస్తాన్, జుబేదాలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జుబేదా జీవనోపాధి నిమిత్తం కువైత్ వెళ్లింది. మూడు రోజుల క్రితం కువైత్ నుంచి స్వగ్రామమైన మహబూబ్‌నగర్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలో భార్య ప్రవర్తనపై భర్తకు అనుమానం రావడంతో ఆమెపై గురువారం రాత్రి యాసిడ్ పోశాడు. తర్వాత స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. ప్రైవేటు వైద్యులు చికిత్స చేయకపోవడంతో 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ మాట్లాడుతూ షేక్ లాల్‌మస్తాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

మామిడి వ్యాపారం డీలా

● తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న జ్యూస్ పరిశ్రమలు ● నష్టాల కడలిలో మామిడి రైతులు



మామిడి కాయలను లోడింగ్ చేస్తున్న కార్మికులు

రైల్వేకోడూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మామిడికి డిమాండ్ లేదన్న సాకుతో జ్యూస్ పరిశ్రమల యజమానులు ధరలను తగ్గించేశారు. ఇటు మామిడి రైతులు, అటు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న జ్యూస్ పరిశ్రమల్లో ఎక్కువ ధరలతో మామిడి కాయలను ఎగుమతి చేసుకుంటున్నారని రైతులు అంటున్నారు. మార్కెట్‌కు పంపే కాయల వ్యాపారం ఇంకా పుంజుకోలేదు. మామిడి ధరలు ఆశించినంత లేకపోవడం రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

రైల్వేకోడూరులో పండించే మామిడి కాయల్లో తోతాపూరి అనే రకం గతంలో జ్యూస్ పరిశ్రమలకు ఎగుమతి చేసే వారు. రానురాను దాని తర్వాత ఆల్ఫోన్సా (ఖాదర్) ఎక్కువగా జ్యూస్ పరిశ్రమలకు ఎగుమతులు చేసేవారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా ఊరగాయలకు ఉపయోగించే కాయలు తప్ప మిగిలిన అన్ని మామిడి రకాలను జ్యూస్‌కు పంపిస్తున్నారు. ప్రధానంగా రైల్వేకోడూరు ప్రాంతంలో పండించే మామిడికి మంచి డిమాండ్ ఉంటుంది. బేనీషా, నీలం, తోతాపూరి, ఖాదర్, మల్లిక, కాలేపాడు, రుమాణి, మాల్గోవా, పులిహోరా, హిమాంపసందు రకాలు పండిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో రైల్వేకోడూరు మామిడి కాయలు ఎక్కువగా కనిపిస్తాయి. ప్రస్తుతం అన్ని రాష్ట్రాలకు కాయలను రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. చిత్తూరు జిల్లాల్లో జ్యూస్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిశ్రమలకు రైల్వేకోడూరు నుంచి ప్రస్తుతం రోజు 10 లారీల్లో మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నారు. పులిహోరా రకం టన్ను రూ.5000, బేనీషా రూ.5,000, తోతాపూరి టన్ను రూ.5000కు జ్యూస్ యజమానులు సిండికేట్ అయి ధరలను నిర్ణయించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులిహోరా టన్ను రూ.14 వేలు, బేనీషా రూ.15 వేలు, తోతాపూరి రూ.15 వేలకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే జ్యూస్ పరిశ్రమ యజమానులు వినడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. సీజన్ మధ్యలో రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి రోజుకు సుమారు 100 లారీల్లో జ్యూస్‌కు ఎగుమతి చేస్తామని రైతులు అంటున్నారు. జ్యూస్ పరిశ్రమల యజమానులు ధరలు పెంచితేనే మామిడి కాయలను ఎగుమతి చేస్తామని రైతులు భీష్మించుకు కూర్చుని కొన్ని రోజుల పాటు కోతలు నిలిపివేశారు. ధరల పెంచని పక్షంలో పండుకు పంపుతామని రైతులు సిద్ధమయ్యారు. కొందరు రైతులు మాత్రమే జ్యూస్‌కు ఎగుమతి చేస్తున్నారు. కాగా ఇటీవల చిత్తూరులో తోతాపూరి మామిడికి గిట్టుబాటు ధరల విషయమై రైతులు, ప్రాసెసింగ్ యూనిట్‌ల ప్రతినిధులతో సమావేశాన్ని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దుగ్గిమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, పూతలపట్టు. నగరి శాసనసభ్యుడు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, గాలి భానుప్రకాష్, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జి.విద్యాధరి, శుభం బన్సల్, ఆదర్శ రాజేంద్రన్, తుడా ఛైర్మన్ కటారి హేమలతలతో కలిసి సమావేశం నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించాలంటే మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మామిడి రైతుల కష్టాలను వివరిస్తామని సమావేశంలో ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మామిడి గుజ్జు, జ్యూస్‌లపై జీఎస్టీలు ఎత్తివేయాలని ఉద్యాన శాఖ డైరెక్టర్లు వివరించారు. మామిడి సీజన్‌లో తోతాపూరి రకానికి సంబంధించిన గిట్టుబాటు ధర విషయంలో రైతులు, ప్రాసెసింగ్ కంపెనీలు సమన్వయం ఎంతో అవసరమని కలెక్టర్లు సమావేశంలో వివరించారు. మామిడిలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నాయని, గుజ్జుకు డిమాండ్ తగ్గిందని, ఎనర్జీ డ్రింక్స్ పట్ల ఆసక్తి చూపడంతో మామిడి డ్రింక్స్ వాడకం తగ్గుతోందని ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. జ్యూస్ పరిశ్రమల యజమానులు ధరలు పెంచుతారా లేక ఉన్న ధరలతోనే కొనుగోలు చేస్తారా అనే విషయం తెలియకపోవడంతో రైతులు, వ్యాపారులు ఆందోళనలో పడ్డారు.



కాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

జ్యూస్ పరిశ్రమల సిండికేట్



జ్యూస్ పరిశ్రమల యజమానులు సిండికేట్ అయి మామిడి కాయల ధరలను తగ్గించారు. దీంతో రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. జ్యూస్ పరిశ్రమలకు తరలించాలంటే చాలా సమస్యలు ఉన్నాయి. దీంతో రైతులు కాయలను జ్యూస్ పరిశ్రమలకు పంపకుండా పండ్లకు పంపుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఇటీవల చిత్తూరులో జరిగిన సమావేశంలో పలు అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. దీనిపై ఇటు రాష్ట్రానికి, అటు కేంద్రానికి నివేదిక త్వరగా పంపాలి. మామిడి రైతులు నష్టపోకుండా ఉండే విధంగా అందరూ కృషి చేయాలి.

- మున్వర్, మామిడి వ్యాపారి, రైల్వేకోడూరు

ప్రతి ఏటా నష్టాలు చవిచూస్తున్న మామిడి రైతులు



మామిడి రైతులు ప్రతి ఏటా నష్టాలు చవిచూస్తున్నారు. ఒక్క కిలో మామిడి కాయలను పండించాలంటే రూ.10 ఖర్చు వస్తుంది. జ్యూస్ పరిశ్రమల యజమానులకు రూ.5కు అడుగుతున్నారు. సాగులో కూలీలు, దున్నకాలు, మందులు తదితర ఖర్చులు ఉంటాయి. దిగుబడి వస్తే ధరలు లేకుండా ఉండడం, కాపు రాకపోతే చేసిన కష్టం కూడా రాకుండా పోతుంది. ప్రతి ఏటా మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మామిడి బోర్డును ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- దండు సోమయ్య, వై.కోట, మామిడి రైతు

టీడీపీలో మహాజోష్

● కలిసికట్టుగా పనిచేసిన నేతలు
● మహానాడు సక్సెస్‌తో పెరిగిన ఆత్మవిశ్వాసం
● జిల్లా అభివృద్ధికి చంద్రబాబు రోడ్ మ్యాప్
● జిల్లా వాసుల్లో చర్చ
● నేతలకు అభినందనలు.. కార్యకర్తలకు హ్యాట్సాఫ్
● టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



(మొదటిపేజీ తరువాయి): కడప, కమలాపురానికి నీటి సమస్య ఉండదు. పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఏడుసార్లు సీఎంను కలిసి ఈ ప్రాజెక్టు ఆవశ్యకతపై వివరించారు. గాలేరు నగరిలో భాగంగా కొన్నేళ్లుగా పనులు జరుగుతున్నాయి. అక్కడక్కడా కాల్వలు కూడా తవ్వారు. ఇది పూర్తయితే కమలాపురం సర్వరాయసాగర్ ప్రాజెక్టులో భాగంగా వీఎన్‌పల్లె, కమలాపురం, వల్లూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి మండలాల్లో 90 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. కడప దాహార్తి కూడా తీరుస్తుంది. సీకేదిన్నె పరిధిలోని గుర్రంగుంపు వద్ద 0.8 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయరు నిర్మించారు. ఇక్కడ నుంచి గ్రావిటీ ద్వారా నేరుగా కడపకు తాగునీటిని తీసుకురావచ్చు. ప్రస్తుతం రూ.650 కోట్లతో కడప తాగునీటికి తెలుగుగంగ నుంచి నీరు తెచ్చేందుకు ప్రాజెక్టు తయారు చేశారు. అలాగే కొప్పర్తి పారిశ్రామిక వాడకు రూ.350 కోట్లతో నీరు తెచ్చే ప్రాజెక్టు చేపట్టారు. అయితే అక్కడ నుంచి వచ్చేది లిఫ్టింగ్ విధానం. దీనికి నిర్వహణ ఖర్చు కరెంటు చార్జీలు తడిచి మోపెడవుతుంది. జీఎన్‌ఎస్‌ఎస్ పూర్తయితే కొప్పర్తికి, కడపకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వవచ్చని ఈ విషయంపై పట్టువదలని విక్రమార్కుడిలా సీఎం చంద్రబాబు దృష్టికి పదే పదే తీసుకెళ్లి ఆయనను ఒప్పించడంలో క్రిష్ణచైతన్యరెడ్డి కీలకపాత్ర పోషించారు.

అలాగే కడపలో తాగునీటి సమస్య, బుగ్గవంక ఇతర వాటిపై ఎమ్మెల్యే ఆర్.మాధవి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావిస్తూ వచ్చారు. వీటన్నింటినీ పరిష్కరిస్తామని మహానాడు సాక్షిగా చంద్రబాబు హామీ ఇచ్చారు. పులివెందులలో ఆగిన పనులు పూర్తి చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పులివెందుల అభివృద్ధిపై బీటెక్ రవి పలుమార్లు సీఎం, మంత్రి దృష్టికి తెచ్చారు. అక్కడ ప్రభుత్వం ప్రత్యేక దృష్టికి తెచ్చి వాటర్‌గ్రిడ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ముందుకెళుతోంది. ఆ మేరకు పనులు కూడా సాగుతున్నాయి. సోమశిల నుంచి 1 టీఎంసీ నీరు తీసుకువస్తే బద్వేలుకు సాగునీరు అందుతుంది. దానిపై కూడా నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. ఇలా మహానాడు వేదికగా జిల్లా అభివృద్ధికి రోడ్‌మ్యాప్ ప్రకటించడంతో టీడీపీలో జోష్ నెలకొంది. అయితే ఇవన్నీ పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎందుకంటే టీడీపీని మరలా ఆదరించారు. ఉమ్మడి జిల్లాలో పదికి ఏడు స్థానాల్లో ఎమ్మెల్యేలను గెలిపించారు. ప్రజల ఆకాంక్షల మేరకు ఎమ్మెల్యేలంతా అధినాయకత్వం వెంటపడి హామీలు అమలు చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

కడపలో పసుపు జెండా రెపరెపలు

టీడీపీ ఆవిర్భావం జరిగిన 1983 నుంచి 1999 వరకు టీడీపీని జిల్లా వాసులు ఆదరించారు. 1983లో ఉమ్మడి జిల్లాలో 11 సెంబ్లీ స్థానాలుండేవి. అప్పుడు లక్కిరెడ్డిపల్లె కూడా ఉండేది. అప్పుడు టీడీపీ 8 సీట్లు గెలుచుకుంది. 1985లో 9 గెలుచుకుంది. 1989లో 2 సీట్లతో సరిపెట్టుకుంది. 1994లో 9, 1999లో 8 సీట్లు గెలుచుకుంది. 2004, 2009, 2014 ఎన్నికల్లో దెబ్బతింది. తరువాత మరలా 2024లో ఏడు సీట్లు గెలుచుకుని సత్తా చాటింది. మహానాడు వేదికగా వచ్చే ఎన్నికల్లో పదికి పది స్థానాలు గెలిపించాలని చంద్రబాబు జనాలకు పిలుపునిచ్చారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

● జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మంచి దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ ఉద్యానవన ప్రకృతి వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌నకు మంచి వర్షాలు కురుస్తున్నాయని, వేసవిలోనే లోదుక్కులు చేసుకుంటే పురుగు బయటపడి మంచి దిగుబడి పొందవచ్చన్నారు. ఈ ఖరీఫ్‌నకు ప్రభుత్వం నుంచి వేరుశనగ కాయలు అందిస్తామని ఆయన తెలియజేశారు. ఆధునిక కొత్త వంగడాలు కదిరి, లేపాక్షి వంటి విశిష్టమైన రకాలను సాగు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు జిల్లా వ్యాప్తంగా 36 వేల క్వింటాళ్ల వేరుశనగ కాయలు జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. కే-6, నారాయణి, కదిరి, కేఎస్‌కే, నాలుగు రకాల విత్తనకాయలు అన్ని రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. లోదుక్కులు చేసుకున్న తర్వాత జూన్ 15 నుంచి జులై 15వ తేదీలోపు భూమిలో విత్తనాలు వేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఆయన తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయిల్ హెల్త్‌కార్డు, ప్రకృతి వ్యవసాయం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏవో రమేశ్‌బాబురావు, ఉద్యానవనశాఖ అధికారి నాగమణి, ఏఈవోలు అనూష, కెరోలిన్, రైతు భరోసా కేంద్రాల క్షేత్రస్థాయి సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మహేశ్‌నాయుడు, వేమన సతీశ్

సుండుపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్ నాయుడు తెలిపారు. శుక్రవారం సుండుపల్లెలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారన్నారు. క్రీడల వలన సమాజంలో గుర్తింపుతో పాటు మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తుందన్నారు. మండలంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగితే ఉత్తమ క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. కష్టపడి, ఇష్టపడి క్రికెట్ ఆడి విజయాలు సాధించాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌నాయుడు అంద జేస్తారన్నారు. అనంతరం గాలివీడు, చెరుకువాండ్లపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గాలివీడు జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తానా ప్రెసిడెంట్ వేమన సతీశ్, టీడీపీ రాజంపేట సమన్వయకర్త, నియోజకవర్గ నాయకులు పోలి సుబ్బారెడ్డి, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు బాషాఖాన్, రిటైర్డ్ అధ్యాపకుడు సుబ్బరాజు, కురవ సంఘం మండల అధ్యక్షుడు మద్దికారి జయరామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చప్పిడి మహేశ్‌నాయుడి జన్మదిన వేడుకలను క్రీడాకారులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

గజగజ వణుకుతున్న పీలేరు !

● పోలీసులు, ఫారెస్టు సిబ్బంది అప్రమత్తం





జాండ్ల వద్ద వరి, అరటి పంటను ధ్వంసం చేసిన ఏనుగు, ఏనుగు అడుగుజాడలు పరిశీలిస్తున్న పీలేరు అటవీ సిబ్బంది

పీలేరు/పీలేరురూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు సంచారంతో పీలేరు మండలం గజగజ వణుకుతోంది. ఒకేరాత్రిలో ఆ ఏనుగు దాదాపు నాలుగు పంచాయతీల పరిధిలోని గ్రామాలను చుట్టేయడం, గతంలో ఏనుగుల గుంపు దాడిలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండడంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో అటు పోలీసులు, ఇటు ఫారెస్టు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఏనుగు సంచరించిన గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఓఎస్ గొల్లపల్లె-ఎర్రగుంటపల్లె వరకు

తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం శేషాచల అడవుల్లోని ఏనుగుల గుంపు నుంచి రెండు ఏనుగులు వేరుపడ్డాయని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. గత వారం రోజులుగా ఎర్రావారిపాళెం మండలంలోని పలు గ్రామాల్లో జంటగా సంచరించిన ఆ ఏనుగులు మూడు రోజుల క్రితం విడిపోయాయని, ఒంటరిగా మిగిలిపోయిన ఓ ఏనుగు గురువారం రాత్రి తనను తరుముతున్న తలకోన ప్రాంత అటవీ సిబ్బందిపై దాడికి యత్నించిందని, ఆ క్రమంలో ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయని వారు తెలిపారు. ఆ ఏనుగు గురువారం రాత్రి ఓఎస్ గొల్లపల్లె నుంచి బయలుదేరి చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామం మీదుగా పీలేరు మండలం జాండ్ల పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చేరిందని పీలేరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సబిహా సుల్తానా తెలిపారు. ఆవులయ్యగారిపల్లెకు చెందిన రైతు ఆదిరెడ్డికి చెందిన ఓ అరటి చెట్టు విరిచేసింది. ఆ శబ్దాలకు బయటకు వచ్చిన గ్రామస్థులు ఏనుగును గమనించి ఫారెస్టు, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. ఇక ఆ ఏనుగు అక్కడి నుంచి గూడరేవుపల్లె మీదుగా పీలేరు ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని తిరుపతి-మదనపల్లె రహదారి దాటి ఎర్రగుంటపల్లె గ్రామంలోకి ప్రవేశించింది. ఏనుగు రోడ్డు దాటుతుండగా తాము గమనించినట్లు పలువురు ప్రజలు తెలియజేయడంతో శుక్రవారం ఉదయం నుంచి ఫారెస్టు సిబ్బంది ఏనుగు అడుగు జాడల ఆధారంగా అది సంచరించిన ప్రదేశాలు కనుగొనే ప్రయత్నాలు చేశారు. ఎర్రగుంటపల్లె సమీపంలో అడుగుజాడలు మాయం కావడంతో అది ఎటు వెళ్లి ఉంటుందో అర్థం కాక వారు తమ ప్రయత్నాలు విరమించుకున్నారు. శుక్రవారం రాత్రి దాని కదలికలు వెలుగు చూస్తే దాన్ని బట్టి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. కాగా ఏనుగుకు సంబంధించిన ఏ చిన్న సమాచారం తెలిసినా తమకు అందజేయాలని పీలేరు ఎస్‌ఐ లోకేశ్, పీలేరు ఎఫ్‌ఎస్‌వో సబిహా సుల్తానా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒంటరి ఏనుగు సంచారం గురించి తెలుసుకున్న మదనపల్లె సబ్-డివిజన్ ఫారెస్టు అధికారులు సైతం శుక్రవారం సాయంత్రం పీలేరుకు చేరుకుని సమీక్ష నిర్వహించారు.

పీలేరు మండలంలో ఏనుగుల సంచారం రెండవ సారి కావడం గమనార్హం. నాలుగు నెలల క్రితం పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని బందార్లపల్లె సమీపంలో వరి, మామిడి తోపులపై దాడిశాయి. ఇక్కడే రాజారెడ్డి అనే రైతును తొక్కి చంపాయి. అనంతరం మండలంలో ఎక్కడా ఇటువంటి సంఘటనలు జరగలేదు. మళ్లీ ఏనుగు సంచారంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేంపల్లె మార్కెట్ వేలం

● పంచాయతీకి రూ.57.05 లక్షల ఆదాయం

వేంపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్‌లో పన్ను వసూలు చేసేకునే హక్కు కోసం నిర్వహించిన వేలంపాట పోటాపోటీగా సాగింది. పులివెందుల డీఎల్‌పీఓ అంకిరెడ్డి రమాదేవి పర్యవేక్షణలో సర్పంచు ఆర్.శ్రీను అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. ఈఓ రామసుబ్బారెడ్డి పది నెలల కాలానికి (జూన్ 1, 2025 నుంచి మార్చి 31, 2026) నిర్వహించారు. ముగ్గురు కాంట్రాక్టర్లు పాల్గొన్నప్పటికీ వారి మధ్యే పోటీ జరిగింది. గత ఏడాది రూ.40.30 లక్షలు కాగా ఈ ఏడాది రూ.57.05 లక్షలకు మల్లూరు వెంకటరామిరెడ్డి దక్కించుకున్నారు.

పరీక్షలు వాయిదా వేయాలి

● డీఆర్‌వోకు ఏఐఎస్‌ఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ విద్యార్థుల పరీక్ష ఫీజు గడువు పెంచి పరీక్షలను వాయిదా వేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో డీఆర్‌వో కె.విశ్వేశ్వరనాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో రాయలసీమ నలుమూలల నుంచి వచ్చి పారా మెడికల్ చదువుతున్నారన్నారు. కళాశాలలో విద్యార్థులకు వసతి గృహం కల్పించాలని, విద్యార్థులతో వెట్టిచాకిరీ మానుకోవాలని ప్రశ్నించినందుకు 21 మందిని పరీక్ష ఫీజు కట్టించకుండా నిలిపివేసే దుర్మార్గ చర్యకు పాల్పడ్డారన్నారు. దీనిపై విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ సహాయ కార్యదర్శి అరుణ్, డీఎంఎల్‌టీ విద్యార్థులు పాల్గొన్నారు.

మహానాడు కాదు.. మహాగోడు : తులసిరెడ్డి

కడప, కలెక్టరేట్, మే 30(ఆంధ్రజ్యోతి): అది మహానాడు కాదు.. మహాగోడు అని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ నాటి మహానాడుకు ఇప్పటి మహానాడుకు చాలా తేడా ఉందన్నారు. సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలి ఆరు శాసనాలు అంటూ పేర్లు పెట్టడాన్ని ఆక్షేపించారు. టీడీపీ పేదల పార్టీ కాదని, ధనికుల పార్టీ అని విమర్శించారు. జిల్లాలో ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.ఏ సత్తార్, సయ్యద్ సలావుద్దీన్, ప్రసాద్‌గౌడ్, శ్యామలమ్మ, నాగరత్న, భువన ఏకాదశి రెడ్డి, రఫీక్‌ఖాన్, మామిళ్ల బాబు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడుటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరీల కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన మూడో రోజు శుక్రవారం సైతం ఏలూరు జిల్లా నూజివీడులో కొనసాగింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 919 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 698 మంది హాజరయ్యారు. స్పోర్ట్స్ కోటా కింద 467 మందికి కాల్ లెటర్లు పంపగా 344 మంది, ఎన్‌సీసీ కోటాలో 452 మందికి కాల్ లెటర్లు పంపగా 354 మంది హాజరయ్యారు.


నిషేధిత వలలతో చేపలు పడుతున్న దృశ్యం

మత్స్య సంపద మటాష్

- సోమశిలలో చేపల మాఫియా
- వెనుక జలాల్లో వందల సంఖ్యలో వేటగాళ్లు
- కోస్తా ప్రాంతం నుంచి అక్రమ వ్యాపారులు
- రోజూ లక్షల రూపాయల చేపల దోపిడీ
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు


సోమశిల ప్రాజెక్టు

బద్వేలు, మే 30 (ఆంధ్రజ్యోతి) : చేపల మాఫియా దెబ్బకు సోమశిల మత్స్య సంపద మటాష్ అవుతోంది. అక్రమ వేటగాళ్ల విసిరే అలివి వలకు చేప పిల్ల విలవిలలాడుతూ బయటపడుతోంది. చేపల వ్యాపారులు కొందరు మాఫియాను తలపిస్తూ రోజుకు లక్ష రూపాయలు సంపదను తోడేస్తున్నారు. 30 నుంచి 40 మందికి లైసెన్స్‌లు ఉన్నట్లు తెలుస్తున్నా సోమశిల వెనుక జలాలలో వందల సంఖ్యలో వేటగాళ్ల చేపలవేట సాగిస్తున్నారు. ఈ తంతు యథేచ్ఛగా జరుగుతున్నా అటవీ, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో చేపల మాఫియాకు అడ్డుఅదుపూ లేకుండా పోయింది.


సోమశిల ప్రాజెక్టు వద్ద తాత్కాలికంగా ఏర్పరుచుకున్న గుడిసెలు (ఫైల్‌ఫొటో)

కోస్తా నుంచి వేటగాళ్లను దించి..

సోమశిల వెనుక జలాల్లో చేపలమాఫియా పిల్ల, పెద్ద చేపలను ఊడ్చేస్తున్నారు. చేపల వేటలో ఆరితేరి అనుభవం కలిగిన కోస్తా జిల్లాల నుంచి వేటగాళ్లను తీసుకువచ్చి ప్రతిరోజూ నిషేధిత వలలతో వేటాడుతున్నారు. ఈ వలలు నిషేధించినా వీటితోనే వేటాడుతుండడంతో సైజుకు రాని చిన్న చేపలు సైతం బయటపడుతున్నాయి. చేపలు పెద్దవి కాకుండా మత్స్య సంపదకు గండికొడుతున్నారు. నలుసు లాంటి చేపలు అయితే కుప్పలు కుప్పలుగా పడేయడం, చిన్న చేపల ఎండ వేసి టన్నుల కొద్ది అమ్ముకోవడం జరుగుతుంది.


చేపల వాహనాన్ని సీజ్ చేసిన దృశ్యం (ఫైల్‌ఫొటో)

చేపలుపట్టే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చే జిల్లా లైసెన్స్ 30 నుంచి 40 మందికి మాత్రమే ఉండగా.. వాటిని అడ్డుపెట్టుకుని వందల మందితో వేటాడిస్తున్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం రూ.20వేలు కోస్తా ప్రాంతం మత్స్యకారులు తీసుకుంటూ ఇక్కడికి వచ్చి చేపలు పడుతున్నారు. జిల్లాలో ఉండే లైసెన్స్‌లు కూడా ఒకరివి ఫోటోలు ఉంటే మరొకరి పేరుతో లైసెన్స్ ఉంటుందని సమాచారం.

అసలైన మత్స్యకారులకు కష్టాలు

చేపల మాఫియా దాటికి అసలైన మత్స్యకారులు నానా కష్టాలు పడుతున్నారు. సోమశిలలో చేపలు ఎదిగితే అవి వర్షాకాలంలో సగిలేరు, పెన్నా నదులు ప్రవహించేటపుడు నీటికి ఎదురెక్కి వస్తాయి. దీంతో ఆయా ప్రాంతాల పరివాహక ప్రాంత మడుగుల్లో మత్స్యకారుడు వేటకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో చివరకు చెన్నూరు ప్రాంతంలో చాలా మంది మామిడి కోత కూలీలుగా వెళుతుండడం ఆ కుటుంబంలో ఆందోళన కలిగిస్తుంది.

గోపవరం, అట్లూరు మండలాల్లో..

గోపవరం, అట్లూరు మండలాల పరిధిలోని సోమశిల బ్యాక్ వాటర్‌లో పెద్ద ఎత్తున చేపల వేట సాగుతోంది. గోపవరం మండలంలోని గట్టుపల్లి, బ్రాహ్మణపల్లి ప్రాంతాలు, అట్లూరు మండలంలోని బ్యాక్‌వాటర్ ప్రాంతంలో చేపల మాఫియా కూలీలను తిష్ట వేయించి వేటాడిస్తోంది. ఈ వేట యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పెద్దగా దృష్టిసారిం చడం లేదు. నాలుగురోజుల క్రితం గోపవరం మండలంలో చేపలతో వెళ్తున్న వాహనాన్ని ఫారెస్టు అధికారులు పట్టుకుని ఆ తర్వాత ఫిషరిష్ డిపార్ట్‌మెంటుకు అప్పచెప్పారు. అంతేకాదు నెల్లూరు రోడ్డులో రెండు చోట్ల చెక్‌పోస్టులు ఉన్నా కూడా ఈ చేపల వాహనాలు తిరుగుతుండడం గమనార్హం. బద్వేలు, కడప ప్రాంతాలో సుమారు 20 మంది చేపల వేటగాళ్ల వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం.

అడ్డూ అదుపు లేకుండా...

చేపల మాఫియా రోజు టన్ను పెద్దసైజు చేపలు వేటాడితే. చిన్నచేపలు మరో టన్ను వరకు వేటాడుతున్నారు. ఇవి రెండు లక్షల రూపాయల మేరకు విలువ చేస్తాయని చెప్పుకొచ్చారు. పెద్ద చేపలను కడప, కేరళ, కొలకత్తాలకు తరలిస్తుండగా ఎండు చేపలను అక్కడే ఎండబెట్టి విజయవాడకు తరలిస్తున్నారు. ఒక కేజీ ఎండు చేపలు రూ.130 ప్రకారం, పచ్చి చేపలు అయితే 70 నుంచి 80 రూపాయల వరకు వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అడ్డు, అదుపు లేకుండా వేట సాగిస్తుండడంతో సోమశిల మత్స్యసంపద మటుమాయం అయ్యే పరిస్థితి నెలకొంది.

అనుమతులు లేకుంటే చర్యలు

సోమశిల ప్రాజెక్టులో చేపలు పట్టి వాహనాల ద్వారా అటవీ ప్రాతంలో అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. వారం రోజుల క్రితం అనుమతులు లేకుండా చేపల లోడుతో వెళుతున్న ఆల్విన్ వాహనాన్ని మత్స్యశాఖాధికారులకు అప్పచెప్పాం. అనుమతి లేకుండా ఫారెస్టులో వాహనాలు వెళితే వాటిని పట్టుకుని సీజ్ చేస్తాం

-నయీం అలీ, ఫారెస్ట్ రేంజర్, బద్వేలు

లైసెన్స్ ఉన్నవారే చేపలు పట్టాలి

లైసెన్స్ ఉన్నవారే చేపలను వేటాడాలి. లైసెన్స్‌లు లేకుండా ఇతర ప్రాంతాలనుంచి వచ్చి చేపలు వేటాడితే చర్యలు చేపడతాం. సోమశిల ప్రాజెక్టులో వారం రోజుల క్రితం ఆకస్మిక తనిఖీలు చేపట్టాం. తాత్కాలికంగా ఉన్న గుడిసెలు తొలగించాం. కోస్తా నుంచి చేపలను వేటాడేందుకు వచ్చిన వారిని పంపించాం. నిషేధిత వలలతో చేపలు వేటాడితే చర్యలు తప్పవు.

-బాలరాజు, మత్స్యశాఖ డెవలప్‌మెంట్ అధికారి

కొరవడిన నిఘా

రిజర్వ్ ఫారెస్టులోకి అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించకూడదు. రెవెన్యూ అనుమతి లేకుండా వాహనాలూ వెళ్లకూడదు. అయితే రిజర్వ్ ఫారెస్టు నుంచే చేపల వాహనాలు తిరుగుతున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోవ డం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో చేపల వేటమాటున ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడ్డ పరిస్థితులు జిల్లాలో కనిపించాయి. ఇప్పటికైనా ఫారెస్టు, మత్స్య, రెవెన్యూ అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

కేజీసెట్ ఫలితాలు విడుదల


కేజీసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న కేఎస్‌ఆర్ఎం ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి(నాని), రాజేశ్వరమ్మ

సీకేదిన్నె, మే 30 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కేజీసెట్ 2౩25 ఫలితాలు విడుదల చేసినట్లు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి(నాని) తెలిపారు. గత అయిదు సంవత్సరాలుగా విజయవంతంగా కేజీసెట్‌ను నిర్వహిస్తున్నామని, ఈనెల 1, 2 తేదీల్లో నిర్వహించిన కేజీసెట్‌కు 2,223 మంది హాజరుకాగా 1719 మంది అర్హత సాధించారన్నారు. కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం సరైన విద్యావకాశాలు లేని గ్రామీణ విద్యార్థులను గుర్తించి వారి ఆశయాలను సాధించుకునేందుకు విద్యార్థుల ప్రతిభను గుర్తించి విద్యాసంస్థలలో ప్రవేశం పొందే అవకాశం, స్కాలర్‌షిప్ అందించడం సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గత నాలుగు సంవత్సరాలకు 12 వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారికి రూ.40లక్షలు విలువైన ఉచిత విద్య, వసతి, రవాణా, స్కాలర్‌షిప్‌లు అందజేశామన్నారు. కేజీసెట్ ద్వారా ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్‌ల రూపంలో ప్రతి సంవత్సరం 3500 నుంచి రూ.10వేల వరకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం ప్రిన్సిపాల్ ఎంపీ రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం



ప్రొద్దుటూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం ఉదయం అమృతేశ్వరస్వామికి ద్వాదశ జ్యోతిర్లింగ అష్టాదశ శక్తిపీఠాలు, నవరత్న లింగానికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీలను చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శనివారం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, చండీహోమాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి నామా నాగశ్రీనివాసులు, టీటీడీ మాజీ సభ్యుడు టంగుటూరి మారుతీప్రసాద్, తల్లం కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు మృతి



ఘటన స్థలంలో మృతి చెందిన ఆటో డ్రైవర్, శ్రీనివాసులు (ఫైల్)

కడప క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం సమీపంలో ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. సిద్దవటం మండలం వన్‌మాధవరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన పెయ్యల శ్రీనివాసులు (40) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవారు. రోజులాగే ఆటోలో కడపకు వచ్చి తిరిగి మాధవరం వెళుతున్నాడు. సబ్‌జైలుకు దగ్గరలోని సైనిక్ నగర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా ఆటోను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ పైనుంచి కిందపడి వ్యక్తి..


శివసాయి మృతదేహం

ఎర్రగుంట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలోని దొండపాడు రస్తాలో ఉన్న జియో సెల్ టవర్ పైనుంచి కిందపడి రిగ్గర్‌గా పని చేస్తున్న ముద్ది శివసాయి (25) శుక్రవారం మృతి చెందాడు. వేంపల్లి మండలం అలిరెడ్డి పల్లెకు చెందిన శివసాయి సెల్‌టవర్ మరమ్మతుల కో సం పైకి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందా డు. నాలుగు నెలల నుంచి నుంచి రిగ్గర్ (సెల్ టవర్ ఎక్కేపని)గా పనిచేస్తు న్నారు. శుక్రవారం ఉదయం టెక్నీషియన్ శేఖర్‌తో కలిసి సేఫ్టీ మెజర్స్‌తో సెల్ టవర్ ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే టవర్‌కు కొక్కీలు వేయడంలో పొరపాటు జరిగింది. దీంతో పైనుంచి కిందపడటంతో మృతి చెందాడు. ఎస్ఐ నాగమురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువతిపై కత్తితో దాడి.. కేసు నమోదు

ముద్దనూరు మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామానికి చెందిన హరిణి అనే యువతిపై కత్తితో దాడికి పాల్పడినక్రాంతికుమార్‌పై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐదస్తగిరి తెలిపారు. కడపలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో హరిణి బీటెక్ చదువుతుండగా.. అన్నమయ్య జిల్లా గాలివీడుమండలం కొప్పలవారిపల్లెకు చెందిన కాంత్రికుమార్ అసిస్టెంట్‌ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేసేవాడు. వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. కొద్ది నెలల తరువాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతోఫోన్‌లో వేధిస్తుండేవాడు. తరువాత కాంత్రికుమార్‌కు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. హరిణి బీటెక్ పూర్తి చేసుకొని సాఫ్ట్‌వేరు ఉద్యోగం రావడంతో బెంగళూరు వెళ్లింది. అయితే ఆమె సోదరి వద్ద ఉండి ఉద్యోగానికి వెళుతుండేది. దీంతో తన వద్దకు రావాలని వేధిస్తుండేవాడు. ఈ ఏడాది జనవరిలో బెంగులూరులో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ క్రాంతి కుమార్ వేధింపులు ఆపకపోవడంతో నల్లబల్లెలోని ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేస్తోంది. అయితే యువతి అడ్రస్ తెలుసుకొని నేరుగా నల్లబల్లెలో ఇంటి వద్ద ఎవరూలేని సమయంలో వచ్చి యువతిని ఫోన్ నెంబర్ చెప్పాలని భయపెట్టి, కత్తితో దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

వైఎస్ విగ్రహాల ముసుగులో రాజకీయాలు మానుకోండి


విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, మే 30 (ఆంధ్రజ్యోతి): వైఎస్ విగ్రహాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం మానుకోవాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు ఘటనపై వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారన్నారు. వైఎస్ సతీమణి వైఎస్ విజయలక్ష్మి, ఆయన కుమార్తె వైఎస్ షర్మిల మీద జగన్ మాదిరి కేసులేమీ పెట్టలేదన్నారు. రాజశేఖర్‌రెడ్డి రాముడు అయితే వివేకానందరెడ్డి లక్ష్మణుడిగా ఉండేవారన్నారు. లక్ష్మణుడి లాంటి వివేకానందరెడ్డిని చంపామని అభియోగాలు ఎదుర్కోలేదన్నారు. అలాగే ఓ కోయిల తొందరపడి ముందే కూసింది అన్న విధంగా వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతున్నారు. మహానాడు అయిపోక ముందే అక్కడ ఏమీ జరగలేదని మాట్లాడడం విడ్డూరమన్నారు. స్టీల్ ప్లాంట్‌ను పది రోజుల్లో మొదలుపెడతాం, జీఎన్ఎస్ ఎస్‌కు రూ.1000కోట్లు ఇస్తాం, గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు రూ.80వేల కోట్లతో చేస్తాం లాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తామని చంద్ర బాబునాయుడు వరాలు ప్రకటించారన్నారు. అయితే అవినాశ్‌రెడ్డి మహానాడు అంతా ఆత్మస్తుతిపరనింద అని మాట్లాడటం అవివేకానికి నిదర్శమన్నారు.

స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామనడం హర్షణీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్టీల్ ప్లాంట్ పనులు పది రోజుల్లో ప్రారంభిస్తామని మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావించిన ప్పటి నుంచి కడప జిల్లాలో మొట్టమొదటిసారి మహానాడు నిర్వహించి రాష్ట్రంలోనే కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేశామన్నారు. కడప మోడల్‌ను ఇప్పటి నుంచి గీటురాయిగా మార్చామన్నారు. జిల్లాలో మహానాడును విజయవంతం చేయడంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు కార్యకర్తల పాత్ర మరువలేనిదన్నారు. మహానాడు మూడు రోజులు అద్భుతంగా జరగడంపై సీఎం చంద్రబాబునాయుడుతో పాటు పార్టీ నాయకత్వం అంతా సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. మహానాడు విజయవంతంతో కడప జిల్లాలో టీడీపీ ఎంత బలంగా వుందో సత్తా చాటినట్లయిందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, టీడీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్, నిమ్మకాయల మున్నా తదితరులు పాల్గొన్నారు.

బద్వేలుకు ముఖ్యమంత్రి వరాల జల్లు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): కడప గడపలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బద్వేలుకు వరాల జల్లు కురిపించారని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ కుమార్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం రాత్రి టీడీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల మండలాలకు తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా నీరందించడంతో పాటు అట్లూరు, గోపవరం, బద్వేలు ప్రాంతాలకు సోమశిల వెనుకజలాల నుంచి చెరువులకు నీరు నింపేందుకు జీవో జారీచేయడం హర్షణీయమన్నారు. రూ.3560 కోట్లతో బద్వేలు టు కృష్ణపట్నం నాలుగులేన్ల రహదారి పనులను పూర్తి చేసేందుకు, బద్వేలు మున్సిపాలిటీకి అమృత్ పథకం కింద రూ.120 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు న్నామన్నారు. మహానాడు కార్యక్రమానికి అంచనాలకు మించి జనం హాజరుకావడం తెలుగుదేశం పార్టీపై చూపిస్తున్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఇందుకోసం కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. బద్వేలు నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా పునరావృతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఉత్సాహంగా సాగిన పసిడిపురి వసంతోత్సవం


చిన్నారులకు మెమొంటోలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పసిడిపురి వసంతోత్సవం ఉత్సాహంగా సాగింది. శుక్రవారం ప్రొద్దుటూరు, కడప, రాజంపేట, వేంపల్లె ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వంద మంది చిన్నారులు తమ నాట్య నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మొహిద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ భారత సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ప్రొద్దుటూరు పసిడిపురి వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించామన్నారు. అనేక కళల్లో నాట్యం ఒక కళ అని, నేడు నాట్య ప్రాముఖ్యను గుర్తించి పిల్లలకు సాంప్రదాయ నృత్యాలను నేర్పించి ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు కూచిపూడి, జానపద, భరతనాట్యం, సంగీతం, సినీ క్లాసికల్, సోలో గ్రూప్ విభాగాల్లో నృత్యాలను ప్రదర్శించారు. ప్రతిభ కనపరిచినవారికి అయోధ్య బాల రామ అవార్డులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. నాట్య గురువులకు నాట్య పతంన అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు, చిన్నారులు, నాట్య గురువులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం హరి టవర్స్‌లో జిల్లా బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, జనరల్ సెక్రటరీ గంధం ప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకరించడం అభినందనీయమన్నారు. వంద అడుగుల విగ్రహం ఏర్పాటుకు త్వరితగతిన పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించామన్నారు. కార్యక్రమంలో బండి బాబు, కృష్ణమూర్తి, తుమ్మల కుంట ఈశ్వరయ్య, పుత్త రాజు, సన్నిదానం, సాయి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఏవో

ఓబులవారిపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయ, అరటి సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల మేలైన దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయాధికారిని మల్లిక సూచించారు. మండలంలోని గాదెల పంచాయతి పరిధిలో సాగు చేస్తున్న బొప్పాయ, అరటి తోటలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను పట్టించుకునేవారేరీ?

ఓబులవారిపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపదను సృష్టించాలనే బృహత్తర ఆశయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలు చేపట్టి దశాబ్దాల కాలం నడుస్తున్నా ఒక్క రూపాయి సంపదను సృష్టించిన దాఖలాలు లేవు. నిర్మాణాలు చేపట్టిన నాటి నుంచి నేటికీ వాటిపేరున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు వెచ్చిస్తూనే ఉన్నాయి. మండల పరిధిలోని 22 పంచాయతీలకు సంబంధించి ప్రతి గ్రామ పంచాయతీ ఒక్కో చెత్త సంపద కేంద్ర నిర్మాణం చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి వాటిద్వారా ఎరువును, ప్లాస్టిక్‌ను వేరు చేసి ఆదాయం తీసుకువచ్చేలా ప్రణాళికతో ఏర్పాటు చేశారు. మండలంలో అరకొరగా కొన్ని పంచాయతీల్లో మాత్రమే చెత్తను సేకరించే పనిలో ఉండగా మిగిలిన పంచాయతీల్లో పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. షెడ్ల నిర్మాణంలో ఏర్పాటు చేసిన గదులకు ఉన్న డోర్లు విరిగిపోయి చెదలు పట్టి నిరుపయోగంగా మారాయి. ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించాల్సిన రిక్షా వాహనాలు సైతం కొన్ని పంచాయతీల్లో విరిగిపోయి తుప్పుపట్టి మూలనపడ్డాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి చెత్త కేంద్రాల వద్ద దిబ్బలుగా పోస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ప్రజలు వీధుల్లో కుప్పలుగా పోసి మురుగు కంపు దోమల వ్యాప్తికి కారకులు అవుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రానికి వెళ్లే చిన్నఓరంపాడు క్రాస్ నుంచి ఓబులవారి పల్లె వరకు ఉన్న గ్రామాల ప్రజలు రోడ్లపై పోస్తున్నారు. గాలి వచ్చినప్పుడు ఆ చెత్త వాహనదారులకు, గ్రామాల్లోకి వెళుతోంది. కొన్ని గ్రామాల్లో ఇంటిపక్కనే చెత్త వేయడం ద్వారా వర్షాలు పడి దోమల నిలయాలుగా మారి డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలబారిన పడి ఆస్పత్రులపాలై ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచులను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు చేపడతామన్నారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలో ఉన్న చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడటంతోపాటు ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలని చూడాలని ప్రజలు కోరుతున్నారు.



అప్పగుంటపల్లెలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

పశువులకు బీమా తప్పనిసరి



పశువైద్యశాలను తనిఖీ చేస్తున్న వెంకటరమణయ్య

సిద్దవటం, మే 30 (ఆంధ్రజ్యోతి):పాడి రైతులు పశువులకు బీమా తప్పక చేయించుకోవాలని కడప పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.వెంకటరమణయ్య తెలిపారు. శుక్రవారం సిద్దవటం పశువైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల బీమా చేయించుకున్న తర్వాత అకస్మాత్తుగా పశువులు చనిపోతే రూ.30 వేల వరకు బీమా వస్తుందన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. పాడి రైతులకు దానా పంపిణీ చేశామన్నారు. కడప డివిజన్ పశుసంవర్ధకశాఖ సహాయకులు శ్రీనివాసుల రెడ్డి, వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సౌమ్యనాథస్వామి ఆలయంలో యోగా

నందలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా శనివారం నందలూరులోని సౌమ్యనాథస్వామి ఆలయంలో దాదాపు వెయ్యి మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధాకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6.30 గంటల నుంచి 7 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం 7 నుంచి 8 గంటల వరకు యోగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాల్గొంటారన్నారు.

చెక్కులు అందజేసిన మండిపల్లి

రాయచోటిటౌన్, మే30(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ క్రీడా కార్యక్రమంలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులకు శుక్రవారం రాయచోటి పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెక్కులు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారులకు విద్య, ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. రాయచోటి ప్రాంతానికి క్రీడల్లో మంచి గుర్తింపు ఉందని, ఈ ప్రాంతాన్ని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ, ప్రధానోపాధ్యాయులు త్యాగరాజన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపించాలి

చిన్నమండెం, మే30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం చూపించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు.

నవాజ్ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, మే30(ఆంధ్రజ్యోతి): తన మిత్రుడు, ప్రజల కోసం పరితపించే వ్యక్తి నవాజ్ మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. శుక్రవారం కురబలకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంతో నవాజ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సుగవాసి ప్రసాద్‌బాబు ఆయన ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. నవాజ్ ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థించారు.

పెనగలూరులో వర్షం

పెనగలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తనం కారణంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఉండడం వల్ల వాతావరణం బాగా చల్లగా ఏర్పడింది.

కలెక్టర్ చొరవతో 25 ఏళ్ల దారి సమస్యకు పరిష్కారం

రైల్వేకోడూరు, మే 30(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చామకూరి శ్రీధర్ చొరవతో 25 ఏళ్ల దారి సమస్యకు పరిష్కారం లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి.... రైల్వేకోడూరు మండలం చియ్యవరం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న వడ్డిపల్లె గ్రామస్థులు 25 ఏళ్లుగా దారి సమస్యతో ఇబ్బందిపడేవారు. ఈ దారికి ముందుగా ఉన్న డీకేటీ భూమిని కొంత మంది ఆక్ర మించుకుని కంచె ఏర్పాటు చేయడం వల్ల దారి సమస్య ఏర్పడింది. దీంతో ఈ ఏడాది మార్చి నెలలో పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ సమస్యను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు పంపారు. కలెక్టర్ పరిశీలించి దారి కల్పించాలని ఆదేశించారు. తహసీల్దార్ దారి సమస్యను పరిష్కరిస్తూ అనుమతి ఇచ్చారు. పోలీస్ రక్షణ మధ్య రెవెన్యూ శాఖ సర్వేయర్, సచివాలయం సర్వేయర్లతో శుక్రవారం దారి ఏర్పాటు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపిన కోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రాజంపేట సబ్ కలెక్టర్‌లను చియ్యవరం వడ్డిపల్లె గ్రామస్థులు అభినందించారు. కాగా టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సహకారంతో అధికారులు ప్రత్యేకంగా స్పందించారని గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



దారి ఏర్పాటుకు యంత్రంతో పనులు చేయిస్తున్న అధికారులు... పోలీసుల రక్షణ

సమష్టి కృషితోనే మహానాడు విజయవంతం : చమర్తి



చమర్తిని సత్కరించిన నేతలు, కార్యకర్తలు

రాజంపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లాలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు విజయానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేశారని పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడు విజయవంతం కావడానికి అందరి కృషే నిదర్శనమన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి విశేషంగా ప్రజలు, కార్యకర్తలు, నేతలు హాజరయ్యారని తెలిపారు. ఈ మహానాడుకు జన సమీకరణలో అనుకున్న లక్ష్యం కన్నా ఎక్కువగా మహిళలు తరలివచ్చారన్నారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు చమర్తికి శాలువా వేసి సత్కరించారు.

కార్మికవర్గ ప్రయోజనాలే సీఐటీయూ లక్ష్యం

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

రాయచోటిటౌన్, మే30(ఆంధ్రజ్యోతి): కార్మికవర్గ ప్రయోజనాలే సీఐటీయూ లక్ష్యమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయచోటి బస్టాండు సమీపంలో సీఐటీయూ జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు డీ.వెంకట్రామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1970 మే 30వ తేదీన కలకత్తాలో సీఐటీయూ ఆవిర్భవించినట్లు మహాసభలు నిర్వహించి ప్రకటించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తోందన్నారు.

అన్ని కార్మిక సంఘాలను ఒక్కతాటిపైకి తెచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తోందని తెలియజేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏపీ రమణ, రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, మున్సిపల్ కార్మిక నేతలు చెన్నయ్య సిద్దయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పనితీరుపై కార్మికుల నిరసన

● తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారంటూ ఆరోపణ



నిరసన తెలియజేసిన మున్సిపల్ సిబ్బంది

రాజంపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలో శుక్రవారం కార్మికులు మున్సిపల్ కమిషనర్ పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటి కమిషనర్ రోజు రోజుకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి వరకు పరుగులు పెట్టిస్తున్న కమిషనర్ పనితీరు పట్ల రాజంపేట పుర ప్రజలు కూడా తీవ్ర విమర్శలు చేస్తున్నారన్నారు. ఇటువంటి నేపథ్యంలో కమిషనర్ ఒత్తిడికి తట్టుకోలేక శుక్రవారం ఉదయం శానిటరి కార్యదర్శి హర్షవర్దన్, ఉద్యోగ రీత్యా పనిఒత్తిడి కారణంగా అస్వస్థతకు గురికావడంతో స్పృహ కోల్పోయారన్నారు. ఆయన్ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారన్నారు. ఈ సందర్భంగా శానిటరి కార్యదర్శి హర్షవర్దన్ భార్య మాట్లాడుతూ మా భర్తపై కమిషనర్ పని ఒత్తిడి పెంచారని,తినడానికి కూడా సమయం లేకుండా పోతుందని కన్నీటిపర్యంతమయ్యారు. సీఐటీయూ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాభారతానికి రూ.ఒక లక్షా 50 వేలు విరాళం



కమిటీ సభ్యులకు విరాళాన్ని అందిస్తున్న మంత్రి సతీమణి హరిత

చిన్నమండెం, మే30(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలం కొత్తపల్లి కస్బాలో జరిగే మహాభారతానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరిత, మౌర్యారెడ్డి శుక్రవారం రూ.ఒక లక్షా 50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని మహాభారతం నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు భోజన వసతులు, మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.

సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలి

నందలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : సాగులో శాస్త్రీయతను పెంపొందించుకోవాలని భారత నూనెగింజల పరిశోధన శాస్త్రవేత్త ఖురేషి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని లేబాక, నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి తోటల పెంపకంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రామకృష్ణరాజు మాట్లాడుతూ మండలంలో ప్రధాన పంట వరి గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ రైతులందరూ విశిష్ట నమోదు సంఖ్య తీసుకోవాలన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు మునీర్‌బాషా



పదవీ విరమణ పొందిన మునీర్‌బాషాను సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు తదితరులు

రాజంపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సాంకేతిక విద్యను బోధించడంలో క్రమపద్ధతిలో నడిపించిన బోధకుడు పి.మునీర్ బాషా అని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుధాకర్ పేర్కొన్నారు. రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో మెకానికల్ విభాగంలో విధులు నిర్వహిస్తూ సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి.మునీర్‌బాషా శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యాబోధనతో పాటు ప్రాక్టికల్స్‌ను క్రమపద్ధతిలో విద్యార్థులకు నేర్పడంలో ఆయన చూపిన శ్రద్ధ అభినందనీయమన్నారు. డాక్టర్ పి.సుజాత, పద్మావతమ్మ, ఎం.వెంకటనారాయణ, సుదాంత్, యజాజ్ అహ్మద్, ఎస్.నిరంజన్, ఎస్.జబ్బార్ మునీర్‌బాషా సేవలను కొనియాడారు. అనంతరం మునీర్‌ను ఘనంగా సన్మానించారు.

రైల్వేట్రాక్ దాటడం చట్టరీత్యా నేరం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ త్రివేణి

నందలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రైల్వేట్రాక్ దాటడం చట్టరీత్యా నేరమని ఆర్పీఎఫ్ ఎస్ఐ త్రివేణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆమె ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటుతూ ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. పశువులు, గొర్రెలను ట్రాక్‌వెంబడి మేపడం, దాటడం చేయకూడదన్నారు. అలా చేయడం వల్ల ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. అలా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ రాధాకృష్ణ, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో, అంగన్వాడీలు


గాలివీడు, మే30(ఆంధ్రజ్యోతి): బాలికలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా కుటుంబ మనుగడ సాధ్యమవుతుందని సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నండింపల్లి అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం- ఆర్థిక క్రమశిక్షణ పాటించడం, బడ్జెట్ తయారీ, పొదుపు, పెట్టుబడులు, అవసరాలు, కోరికలు, భవిష్యత్ లక్ష్యాలు, ఆర్థిక ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోనీ, కిశోరీ బాలికలు, చిన్నపిల్లలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ మూర్తిని సత్కరించిన యద్దల సుబ్బరాయుడు



నందలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల- తిరుపతి దేవస్థానం స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికైన సీనియర్ న్యాయవాది జీఎస్ మూర్తిని ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యద్దల సుబ్బరాయుడు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ మూర్తి సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనకు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గంటా వాసుదేవయ్య, సౌమ్యనాథ అన్నదాన ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్న పాల్గొన్నారు.

అన్నమయ్య ముంపు ప్రాంతాలను పరిశీలించిన జనసేన నాయకులు



వరద బాధితులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన నాయకులు

రాజంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం రాజంపేట మండలం అన్నమయ్య ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాజంపేట పార్లమెంట్ జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాస రాజు, అతికారి కృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా అరవ శ్రీధర్ మాట్లాడుతూ ముంపు గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ముంపు గ్రామాల్లో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు పులపత్తూరు, తొగురుపేట, మందపల్లె తదితర గ్రామాల్లో పర్యటించి సమస్యలపై నివేదికను తయారు చేసి డిప్యూటీ సీఎంకు పంపిస్తామని బాధితులకు తెలిపారు. ఇటీవల చనిపోయిన జనసేన కార్యకర్త కేశవ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. జనసేన నాయకులు శివరామరాజు, తాతంశెట్టి నాగేంద్రలతో పాటు స్థానిక జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

'అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల గోడు వైసీపీకి శాపం'

సిద్దవటం మే 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల గోడు వైసీపీకి శాపం అని రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. మండలంలోని మాధవరం-1, పార్వతీపు రం గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీ పీ ప్రభుత్వ పాలనలో పా లకుల ధన దాహార్తికి అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి ఎన్నో పేద, బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టడానికి యత్నిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : ఎంపీపీ



మాట్లాడుతున్న లక్ష్మీదేవి

ఒంటిమిట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎంపీపీ నల్గొండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహానాడు విజయవంతంగా ముగిసిందన్నారు.మహానాడు చివరి రోజు లక్షలాది మంది విచ్చేసి బహిరంగసభను విజయవంతం చేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండాలన్నారు. ఎంపీపీ ప్రతినిధి నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ అజంతుల్లా పాల్గొన్నారు.

ఈతపండ్ల కోసం వెళ్లి వ్యక్తి మృతి

సుండుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి):సుండుపల్లి మండల కేంద్రానికి చెందిన జలంధర్(53)అనే వ్యక్తి ఈతపండ్ల కోసం వెళ్లి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. జలంధర్ మండల కేంద్రంలోని ఎరుకలకాలనీకి చెందిన మరో వ్యక్తితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున అడవికి వెళ్లాడు. ఆ సమయంలో అడవిలో గుండెనొప్పి రావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. జలంధర్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అన్నమయ్య థీమ్‌పార్కును పరిశీలించిన జేసీ



థీమ్‌పార్కును పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాజంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య థీమ్‌పార్కును జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ పరిశీలించారు. చారిత్రాత్మక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ పార్కును పరిశీలించినట్లు ఆయన తెలిపారు. శనివారం ఉదయం సౌమ్యనాథస్వామి ఆలయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అన్నమయ్య థీమ్‌పార్కులో కూడా యోగా కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఏవో బాలమునిస్వామి, చలపతి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో
భర్త యాసిడ్‌తో దాడి

సిద్దవటం, మే 30 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో గురువారం రాత్రి ఆమె శరీరభాగాలపై యాసిడ్ పోసిన ఘటన మాధవరం గ్రామ పంచాయతీ మహబూబ్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, ఎస్‌ఐ మహమ్మద్‌రఫి వివరాల మేరకు... మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ లాల్ మస్తాన్, జుబేదాలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జుబేదా జీవనోపాధి నిమిత్తం కువైత్ వెళ్లింది. మూడు రోజుల క్రితం కువైత్ నుంచి స్వగ్రామమైన మహబూబ్‌నగర్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలో భార్య ప్రవర్తనపై భర్తకు అనుమానం రావడంతో ఆమెపై గురువారం రాత్రి యాసిడ్ పోశాడు. తర్వాత స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. ప్రైవేటు వైద్యులు చికిత్స చేయకపోవడంతో 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ మాట్లాడుతూ షేక్ లాల్‌మస్తాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

మామిడి వ్యాపారం డీలా

● తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న జ్యూస్ పరిశ్రమలు ● నష్టాల కడలిలో మామిడి రైతులు



మామిడి కాయలను లోడింగ్ చేస్తున్న కార్మికులు

రైల్వేకోడూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మామిడికి డిమాండ్ లేదన్న సాకుతో జ్యూస్ పరిశ్రమల యజమానులు ధరలను తగ్గించేశారు. ఇటు మామిడి రైతులు, అటు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న జ్యూస్ పరిశ్రమల్లో ఎక్కువ ధరలతో మామిడి కాయలను ఎగుమతి చేసుకుంటున్నారని రైతులు అంటున్నారు. మార్కెట్‌కు పంపే కాయల వ్యాపారం ఇంకా పుంజుకోలేదు. మామిడి ధరలు ఆశించినంత లేకపోవడం రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

రైల్వేకోడూరులో పండించే మామిడి కాయల్లో తోతాపూరి అనే రకం గతంలో జ్యూస్ పరిశ్రమలకు ఎగుమతి చేసే వారు. రానురాను దాని తర్వాత ఆల్ఫోన్సా (ఖాదర్) ఎక్కువగా జ్యూస్ పరిశ్రమలకు ఎగుమతులు చేసేవారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా ఊరగాయలకు ఉపయోగించే కాయలు తప్ప మిగిలిన అన్ని మామిడి రకాలను జ్యూస్‌కు పంపిస్తున్నారు. ప్రధానంగా రైల్వేకోడూరు ప్రాంతంలో పండించే మామిడికి మంచి డిమాండ్ ఉంటుంది. బేనీషా, నీలం, తోతాపూరి, ఖాదర్, మల్లిక, కాలేపాడు, రుమాణి, మాల్గోవా, పులిహోరా, హిమాంపసందు రకాలు పండిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో రైల్వేకోడూరు మామిడి కాయలు ఎక్కువగా కనిపిస్తాయి. ప్రస్తుతం అన్ని రాష్ట్రాలకు కాయలను రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. చిత్తూరు జిల్లాల్లో జ్యూస్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిశ్రమలకు రైల్వేకోడూరు నుంచి ప్రస్తుతం రోజు 10 లారీల్లో మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నారు. పులిహోరా రకం టన్ను రూ.5000, బేనీషా రూ.5,000, తోతాపూరి టన్ను రూ.5000కు జ్యూస్ యజమానులు సిండికేట్ అయి ధరలను నిర్ణయించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులిహోరా టన్ను రూ.14 వేలు, బేనీషా రూ.15 వేలు, తోతాపూరి రూ.15 వేలకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే జ్యూస్ పరిశ్రమ యజమానులు వినడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. సీజన్ మధ్యలో రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి రోజుకు సుమారు 100 లారీల్లో జ్యూస్‌కు ఎగుమతి చేస్తామని రైతులు అంటున్నారు. జ్యూస్ పరిశ్రమల యజమానులు ధరలు పెంచితేనే మామిడి కాయలను ఎగుమతి చేస్తామని రైతులు భీష్మించుకు కూర్చుని కొన్ని రోజుల పాటు కోతలు నిలిపివేశారు. ధరల పెంచని పక్షంలో పండుకు పంపుతామని రైతులు సిద్ధమయ్యారు. కొందరు రైతులు మాత్రమే జ్యూస్‌కు ఎగుమతి చేస్తున్నారు. కాగా ఇటీవల చిత్తూరులో తోతాపూరి మామిడికి గిట్టుబాటు ధరల విషయమై రైతులు, ప్రాసెసింగ్ యూనిట్‌ల ప్రతినిధులతో సమావేశాన్ని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దుగ్గిమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, పూతలపట్టు. నగరి శాసనసభ్యుడు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, గాలి భానుప్రకాష్, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జి.విద్యాధరి, శుభం బన్సల్, ఆదర్శ రాజేంద్రన్, తుడా చైర్మన్ కటారి హేమలతలతో కలిసి సమావేశం నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించాలంటే మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మామిడి రైతుల కష్టాలను వివరిస్తామని సమావేశంలో ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మామిడి గుజ్జు, జ్యూస్‌లపై జీఎస్టీలు ఎత్తివేయాలని ఉద్యాన శాఖ డైరెక్టర్లు వివరించారు. మామిడి సీజన్‌లో తోతాపూరి రకానికి సంబంధించిన గిట్టుబాటు ధర విషయంలో రైతులు, ప్రాసెసింగ్ కంపెనీలు సమన్వయం ఎంతో అవసరమని కలెక్టర్లు సమావేశంలో వివరించారు. మామిడిలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నాయని, గుజ్జుకు డిమాండ్ తగ్గిందని, ఎనర్జీ డ్రింక్స్ పట్ల ఆసక్తి చూపడంతో మామిడి డ్రింక్స్ వాడకం తగ్గుతోందని ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. జ్యూస్ పరిశ్రమల యజమానులు ధరలు పెంచుతారా లేక ఉన్న ధరలతోనే కొనుగోలు చేస్తారా అనే విషయం తెలియకపోవడంతో రైతులు, వ్యాపారులు ఆందోళనలో పడ్డారు.



కాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

జ్యూస్ పరిశ్రమల సిండికేట్



జ్యూస్ పరిశ్రమల యజమానులు సిండికేట్ అయి మామిడి కాయల ధరలను తగ్గించారు. దీంతో రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. జ్యూస్ పరిశ్రమలకు తరలించాలంటే చాలా సమస్యలు ఉన్నాయి. దీంతో రైతులు కాయలను జ్యూస్ పరిశ్రమలకు పంపకుండా పండ్లకు పంపుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఇటీవల చిత్తూరులో జరిగిన సమావేశంలో పలు అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. దీనిపై ఇటు రాష్ట్రానికి, అటు కేంద్రానికి నివేదిక త్వరగా పంపాలి. మామిడి రైతులు నష్టపోకుండా ఉండే విధంగా అందరూ కృషి చేయాలి.

- మున్వర్, మామిడి వ్యాపారి, రైల్వేకోడూరు

ప్రతి ఏటా నష్టాలు చవిచూస్తున్న మామిడి రైతులు



మామిడి రైతులు ప్రతి ఏటా నష్టాలు చవిచూస్తున్నారు. ఒక్క కిలో మామిడి కాయలను పండించాలంటే రూ.10 ఖర్చు వస్తుంది. జ్యూస్ పరిశ్రమల యజమానులకు రూ.5కు అడుగుతున్నారు. సాగులో కూలీలు, దున్నకాలు, మందులు తదితర ఖర్చులు ఉంటాయి. దిగుబడి వస్తే ధరలు లేకుండా ఉండడం, కాపు రాకపోతే చేసిన కష్టం కూడా రాకుండా పోతుంది. ప్రతి ఏటా మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మామిడి బోర్డును ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- దండు సోమయ్య, వై.కోట, మామిడి రైతు

టీడీపీలో మహాజోష్

● కలిసికట్టుగా పనిచేసిన నేతలు
● మహానాడు సక్సెస్‌తో పెరిగిన ఆత్మవిశ్వాసం
● జిల్లా అభివృద్ధికి చంద్రబాబు రోడ్ మ్యాప్
● జిల్లా వాసుల్లో చర్చ
● నేతలకు అభినందనలు.. కార్యకర్తలకు హ్యాట్సాఫ్
● టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



(మొదటిపేజీ తరువాయి): కడప, కమలాపురానికి నీటి సమస్య ఉండదు. పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఏడుసార్లు సీఎంను కలిసి ఈ ప్రాజెక్టు ఆవశ్యకతపై వివరించారు. గాలేరు నగరిలో భాగంగా కొన్నేళ్లుగా పనులు జరుగుతున్నాయి. అక్కడక్కడా కాల్వలు కూడా తవ్వారు. ఇది పూర్తయితే కమలాపురం సర్వరాయసాగర్ ప్రాజెక్టులో భాగంగా వీఎన్‌పల్లె, కమలాపురం, వల్లూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి మండలాల్లో 90 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. కడప దాహార్తి కూడా తీరుస్తుంది. సీకేదిన్నె పరిధిలోని గుర్రంగుంపు వద్ద 0.8 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయరు నిర్మించారు. ఇక్కడ నుంచి గ్రావిటీ ద్వారా నేరుగా కడపకు తాగునీటిని తీసుకురావచ్చు. ప్రస్తుతం రూ.650 కోట్లతో కడప తాగునీటికి తెలుగుగంగ నుంచి నీరు తెచ్చేందుకు ప్రాజెక్టు తయారు చేశారు. అలాగే కొప్పర్తి పారిశ్రామిక వాడకు రూ.350 కోట్లతో నీరు తెచ్చే ప్రాజెక్టు చేపట్టారు. అయితే అక్కడ నుంచి వచ్చేది లిఫ్టింగ్ విధానం. దీనికి నిర్వహణ ఖర్చు కరెంటు చార్జీలు తడిచి మోపెడవుతుంది. జీఎన్ఎస్ఎస్ పూర్తయితే కొప్పర్తికి, కడపకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వవచ్చని ఈ విషయంపై పట్టువదలని విక్రమార్కుడిలా సీఎం చంద్రబాబు దృష్టికి పదే పదే తీసుకెళ్లి ఆయనను ఒప్పించడంలో క్రిష్ణచైతన్యరెడ్డి కీలకపాత్ర పోషించారు. అలాగే కడపలో తాగునీటి సమస్య, బుగ్గవంక ఇతర వాటిపై ఎమ్మెల్యే ఆర్.మాధవి పలు మార్లు అసెంబ్లీలో ప్రస్తావిస్తూ వచ్చారు. వీటన్నింటినీ పరిష్కరిస్తామని మహానాడు సాక్షిగా చంద్రబాబు హామీ ఇచ్చారు. పులివెందులలో ఆగిన పనులు పూర్తి చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పులివెందుల అభివృద్ధిపై బీటెక్ రవి పలుమార్లు సీఎం, మంత్రి దృష్టికి తెచ్చారు. అక్కడ ప్రభుత్వం ప్రత్యేక దృష్టికి తెచ్చి వాటర్‌గ్రిడ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ముందుకెళుతోంది. ఆ మేరకు పనులు కూడా సాగుతున్నాయి. సోమశిల నుంచి 1 టీఎంసీ నీరు తీసుకువస్తే బద్వేలుకు సాగునీరు అందుతుంది. దానిపై కూడా నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. ఇలా మహానాడు వేదికగా జిల్లా అభివృద్ధికి రోడ్‌మ్యాప్ ప్రకటించడంతో టీడీపీలో జోష్ నెలకొంది. అయితే ఇవన్నీ పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎందుకంటే టీడీపీని మరలా ఆదరించారు. ఉమ్మడి జిల్లాలో పదికి ఏడు స్థానాల్లో ఎమ్మెల్యేలను గెలిపించారు. ప్రజల ఆకాంక్షల మేరకు ఎమ్మెల్యేలంతా అధినాయకత్వం వెంటపడి హామీలు అమలు చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

కడపలో పసుపు జెండా రెపరెపలు

టీడీపీ ఆవిర్భావం జరిగిన 1983 నుంచి 1999 వరకు టీడీపీని జిల్లా వాసులు ఆదరించారు. 1983లో ఉమ్మడి జిల్లాలో 11 సెంబ్లీ స్థానాలుండేవి. అప్పుడు లక్కిరెడ్డిపల్లె కూడా ఉండేది. అప్పుడు టీడీపీ 8 సీట్లు గెలుచుకుంది. 1985లో 9 గెలుచుకుంది. 1989లో 2 సీట్లతో సరిపెట్టుకుంది. 1994లో 9, 1999లో 8 సీట్లు గెలుచుకుంది. 2004, 2009, 2014 ఎన్నికల్లో దెబ్బతింది. తరువాత మరలా 2024లో ఏడు సీట్లు గెలుచుకుని సత్తా చాటింది. మహానాడు వేదికగా వచ్చే ఎన్నికల్లో పదికి పది స్థానాలు గెలిపించాలని చంద్రబాబు జనాలకు పిలుపునిచ్చారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

● జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మంచి దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ ఉద్యానవన ప్రకృతి వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌నకు మంచి వర్షాలు కురుస్తున్నాయని, వేసవిలోనే లోదుక్కులు చేసుకుంటే పురుగు బయటపడి మంచి దిగుబడి పొందవచ్చన్నారు. ఈ ఖరీఫ్‌నకు ప్రభుత్వం నుంచి వేరుశనగ కాయలు అందిస్తామని ఆయన తెలియజేశారు. ఆధునిక కొత్త వంగడాలు కదిరి, లేపాక్షి వంటి విశిష్టమైన రకాలను సాగు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు జిల్లా వ్యాప్తంగా 36 వేల క్వింటాళ్లు వేరుశనగ కాయలు జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. కే-6, నారాయణి, కదిరి, కేఎస్‌కే, నాలుగు రకాల విత్తనకాయలు అన్ని రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. లోదుక్కులు చేసుకున్న తర్వాత జూన్ 15 నుంచి జూలై 15వ తేదీలోపు భూమిలో విత్తనాలు వేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఆయన తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయిల్ హెల్త్‌కార్డు, ప్రకృతి వ్యవసాయం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏవో రమేశ్‌బాబురావు, ఉద్యానవనశాఖ అధికారి నాగమణి, ఏఈవోలు అనూష, కెరోలిన్, రైతు భరోసా కేంద్రాల క్షేత్రస్థాయి సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.

గజగజ వణుకుతున్న పీలేరు !

● పోలీసులు, ఫారెస్టు సిబ్బంది అప్రమత్తం





జాండ్ల వద్ద వరి, అరటి పంటను ధ్వంసం చేసిన ఏనుగు, ఏనుగు అడుగుజాడలు పరిశీలిస్తున్న పీలేరు అటవీ సిబ్బంది

పీలేరు/పీలేరురూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు సంచారంతో పీలేరు మండలం గజగజ వణుకుతోంది. ఒకేరాత్రిలో ఆ ఏనుగు దాదాపు నాలుగు పంచాయతీల పరిధిలోని గ్రామాలను చుట్టేయడం, గతంలో ఏనుగుల గుంపు దాడిలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండడంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో అటు పోలీసులు, ఇటు ఫారెస్టు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఏనుగు సంచరించిన గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఓఎస్ గొల్లపల్లె-ఎర్రగుంటపల్లె వరకు

తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం శేషాచల అడవుల్లోని ఏనుగుల గుంపు నుంచి రెండు ఏనుగులు వేరుపడ్డాయని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. గత వారం రోజులుగా ఎర్రావారిపాళెం మండలంలోని పలు గ్రామాల్లో జంటగా సంచరించిన ఆ ఏనుగులు మూడు రోజుల క్రితం విడిపోయాయని, ఒంటరిగా మిగిలిపోయిన ఓ ఏనుగు గురువారం రాత్రి తనను తరుముతున్న తలకోన ప్రాంత అటవీ సిబ్బందిపై దాడికి యత్నించిందని, ఆ క్రమంలో ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయని వారు తెలిపారు. ఆ ఏనుగు గురువారం రాత్రి ఓఎస్ గొల్లపల్లె నుంచి బయలుదేరి చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామం మీదుగా పీలేరు మండలం జాండ్ల పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చేరిందని పీలేరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సబిహా సుల్తానా తెలిపారు. ఆవులయ్యగారిపల్లెకు చెందిన రైతు ఆదిరెడ్డికి చెందిన ఓ అరటి చెట్టు విరిచేసింది. ఆ శబ్దాలకు బయటకు వచ్చిన గ్రామస్తులు ఏనుగును గమనించి ఫారెస్టు, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. ఇక ఆ ఏనుగు అక్కడి నుంచి గూడరేవుపల్లె మీదుగా పీలేరు ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని తిరుపతి-మదనపల్లె రహదారి దాటి ఎర్రగుంటపల్లె గ్రామంలోకి ప్రవేశించింది. ఏనుగు రోడ్డు దాటుతుండగా తాము గమనించినట్లు పలువురు ప్రజలు తెలియజేయడంతో శుక్రవారం ఉదయం నుంచి ఫారెస్టు సిబ్బంది ఏనుగు అడుగు జాడల ఆధారంగా అది సంచరించిన ప్రదేశాలు కనుగొనే ప్రయత్నాలు చేశారు. ఎర్రగుంటపల్లె సమీపంలో అడుగుజాడలు మాయం కావడంతో అది ఎటు వెళ్లి ఉంటుందో అర్థం కాక వారు తమ ప్రయత్నాలు విరమించుకున్నారు. శుక్రవారం రాత్రి దాని కదలికలు వెలుగు చూస్తే దాన్ని బట్టి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. కాగా ఏనుగుకు సంబంధించిన ఏ చిన్న సమాచారం తెలిసినా తమకు అందజేయాలని పీలేరు ఎస్ఐ లోకేశ్, పీలేరు ఎఫ్ఎస్‌వో సబిహా సుల్తానా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒంటరి ఏనుగు సంచారం గురించి తెలుసుకున్న మదనపల్లె సబ్-డివిజన్ ఫారెస్టు అధికారులు సైతం శుక్రవారం సాయంత్రం పీలేరుకు చేరుకుని సమీక్ష నిర్వహించారు.

పీలేరు మండలంలో ఏనుగుల సంచారం రెండవ సారి కావడం గమనార్హం. నాలుగు నెలల క్రితం పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని బందార్లపల్లె సమీపంలో వరి, మామిడి తోపులపై దాడిశాయి. ఇక్కడే రాజారెడ్డి అనే రైతును తొక్కి చంపాయి. అనంతరం మండలంలో ఎక్కడా ఇటువంటి సంఘటనలు జరగలేదు. మళ్లీ ఏనుగు సంచారంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేంపల్లె మార్కెట్ వేలం

● పంచాయతీకి రూ.57.05 లక్షల ఆదాయం

వేంపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్‌లో పన్ను వసూలు చేసేకునే హక్కు కోసం నిర్వహించిన వేలంపాట పోటాపోటీగా సాగింది. పులివెందుల డీఎల్‌పీఓ అంకిరెడ్డి రమాదేవి పర్యవేక్షణలో సర్పంచు ఆర్.శ్రీను అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. ఈఓ రామసుబ్బారెడ్డి పది నెలల కాలానికి (జూన్ 1, 2025 నుంచి మార్చి 31, 2026) నిర్వహించారు. ముగ్గురు కాంట్రాక్టర్లు పాల్గొన్నప్పటికీ వారి మధ్యే పోటీ జరిగింది. గత ఏడాది రూ.40.30 లక్షలు కాగా ఈ ఏడాది రూ.57.05 లక్షలకు మల్లూరు వెంకటరామిరెడ్డి దక్కించుకున్నారు.

పరీక్షలు వాయిదా వేయాలి

● డీఆర్‌వోకు ఏఐఎస్ఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ విద్యార్థుల పరీక్ష ఫీజు గడువు పెంచి పరీక్షలను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో డీఆర్‌వో కె.విశ్వేశ్వరనాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో రాయలసీమ నలుమూలల నుంచి వచ్చి పారా మెడికల్ చదువుతున్నారన్నారు. కళాశాలలో విద్యార్థులకు వసతి గృహం కల్పించాలని, విద్యార్థులతో వెట్టిచాకిరీ మానుకోవాలని ప్రశ్నించినందుకు 21 మందిని పరీక్ష ఫీజు కట్టించకుండా నిలిపి వేసే దుర్మార్గ చర్యకు పాల్పడ్డారన్నారు. దీనిపై విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి అరుణ్, డీఎల్ఎంటీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మహేశ్‌నాయుడు, వేమన సతీశ్

సుండుపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్ నాయుడు తెలిపారు. శుక్రవారం సుండుపల్లెలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారన్నారు. క్రీడల వలన సమాజంలో గుర్తింపుతో పాటు మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తుందన్నారు. మండలంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగితే ఉత్తమ క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. కష్టపడి, ఇష్టపడి క్రికెట్ ఆడి విజయాలు సాధించాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌నాయుడు అంద జేస్తారన్నారు. అనంతరం గాలివీడు, చెరుకువాండ్లపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గాలివీడు జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తానా ప్రెసిడెంట్ వేమన సతీశ్, టీడీపీ రాజంపేట సమన్వయకర్త, నియోజకవర్గ నాయకులు పోలి సుబ్బారెడ్డి, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు బాషాఖాన్, రిటైర్డ్ అధ్యాపకుడు సుబ్బరాజు, కురవ సంఘం మండల అధ్యక్షుడు మద్దికారి జయరామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చప్పిడి మహేశ్‌నాయుడి జన్మదిన వేడుకలను క్రీడాకారులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

మహానాడు కాదు.. మహాగోడు : తులసిరెడ్డి

కడప, కలెక్టరేట్, మే 30(ఆంధ్రజ్యోతి): అది మహానాడు కాదు.. మహాగోడు అని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ నాటి మహానాడుకు ఇప్పటి మహానాడుకు చాలా తేడా ఉందన్నారు. సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలి ఆరు శాసనాలు అంటూ పేర్లు పెట్టడాన్ని ఆక్షేపించారు. టీడీపీ పేదల పార్టీ కాదని, ధనికుల పార్టీ అని విమర్శించారు. జిల్లాలో ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.ఏ సత్తార్, సయ్యద్ సలావుద్దీన్, ప్రసాద్‌గౌడ్, శ్యామలమ్మ, నాగరత్న, భువన ఏకాదశి రెడ్డి, రఫీక్‌ఖాన్, మామిళ్ల బాబు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడుటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరీల కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన మూడో రోజు శుక్రవారం సైతం ఏలూరు జిల్లా నూజివీడులో కొనసాగింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 919 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 698 మంది హాజరయ్యారు. స్పోర్ట్స్ కోటా కింద 467 మందికి కాల్ లెటర్లు పంపగా 344 మంది, ఎన్‌సీసీ కోటాలో 452 మందికి కాల్ లెటర్లు పంపగా 354 మంది హాజరయ్యారు.



నిషేధిత వలలతో చేపలు పడుతున్న దృశ్యం

మత్స్య సంపద మటాష్

- సోమశిలలో చేపల మాఫియా
- వెనుక జలాల్లో వందల సంఖ్యలో వేటగాళ్లు
- కోస్తా ప్రాంతం నుంచి అక్రమ వ్యాపారులు
- రోజూ లక్షల రూపాయల చేపల దోపిడీ
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



సోమశిల ప్రాజెక్టు

బద్వేలు, మే 30 (ఆంధ్రజ్యోతి) : చేపల మాఫియా దెబ్బకు సోమశిల మత్స్య సంపద మటాష్ అవుతోంది. అక్రమ వేటగాళ్లు విసిరే అలివి వలకు చేప పిల్ల విలవిలలాడుతూ బయటపడుతోంది. చేపల వ్యాపారులు కొందరు మాఫియాను తలపిస్తూ రోజుకు లక్ష రూపాయలు సంపదను తోడేస్తున్నారు. 30 నుంచి 40 మందికి లైసెన్స్‌లు ఉన్నట్లు తెలుస్తున్నా సోమశిల వెనుక జలాలలో వందల సంఖ్యలో వేటగాళ్లు చేపలవేట సాగిస్తున్నారు. ఈ తంతు యథేచ్ఛగా జరుగుతున్నా అటవీ, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో చేపల మాఫియాకు అడ్డుఅదుపూ లేకుండా పోయింది.

కోస్తా నుంచి వేటగాళ్లను దించి..

సోమశిల వెనుక జలాల్లో చేపలమాఫియా పిల్ల, పెద్ద చేపలను ఊడ్చేస్తున్నారు. చేపల వేటలో ఆరితేరి అనుభవం కలిగిన కోస్తా జిల్లాల నుంచి వేటగాళ్లను తీసుకువచ్చి ప్రతిరోజూ నిషేధిత వలలతో వేటాడుతున్నారు. ఈ వలలు నిషేధించినా వీటితోనే వేటాడుతుండడంతో సైజుకు రాని చిన్న చేపలు సైతం బయటపడుతున్నాయి. చేపలు పెద్దవి కాకుండా మత్స్య సంపదకు గండికొడుతున్నారు. నలుసు లాంటి చేపలు అయితే కుప్పలు కుప్పలుగా పడేయడం, చిన్న చేపల ఎండ వేసి టన్నుల కొద్ది అమ్ముకోవడం జరుగుతుంది.



సోమశిల ప్రాజెక్టు వద్ద తాత్కాలికంగా ఏర్పరుచుకున్న గుడిసెలు (ఫైల్‌ఫొటో)



చేపల వాహనాన్ని సీజ్ చేసిన దృశ్యం (ఫైల్‌ఫొటో)

చేపలుపట్టే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చే జిల్లా లైసెన్స్ 30 నుంచి 40 మందికి మాత్రమే ఉండగా.. వాటిని అడ్డుపెట్టుకుని వందల మందితో వేటాడిస్తున్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం రూ.20వేలు కోస్తా ప్రాంతం మత్స్యకారులు తీసుకుంటూ ఇక్కడికి వచ్చి చేపలు పడుతున్నారు. జిల్లాలో ఉండే లైసెన్స్‌లు కూడా ఒకరివి ఫోటోలు ఉంటే మరొకరి పేరుతో లైసెన్స్ ఉంటుందని సమాచారం.

అసలైన మత్స్యకారులకు కష్టాలు

చేపల మాఫియా దాటికి అసలైన మత్స్యకారులు నానా కష్టాలు పడుతున్నారు. సోమశిలలో చేపలు ఎదిగితే అవి వర్షాకాలంలో సగిలేరు, పెన్నానదులు ప్రవహించేటపుడు నీటికి ఎదురెక్కి వస్తాయి. దీంతో ఆయా ప్రాంతాల పరివాహక ప్రాంత మడుగుల్లో మత్స్యకారుడు వేటకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో చివరకు చెన్నూరు ప్రాంతంలో చాలా మంది మామిడి కోత కూలీలుగా వెళుతుండడం ఆ కుటుంబంలో ఆందోళన కలిగిస్తుంది.

గోపవరం, అట్లూరు మండలాల్లో..

గోపవరం, అట్లూరు మండలాల పరిధిలోని సోమశిల బ్యాక్ వాటర్‌లో పెద్ద ఎత్తున చేపల వేట సాగుతోంది. గోపవరం మండలంలోని గట్టుపల్లి, బ్రాహ్మణపల్లి ప్రాంతాలు, అట్లూరు మండలంలోని బ్యాక్‌వాటర్ ప్రాంతంలో చేపల మాఫియా కూలీలను తిష్ట వేయించి వేటాడిస్తోంది. ఈ వేట యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పెద్దగా దృష్టిసారించడం లేదు. నాలుగురోజుల క్రితం గోపవరం మండలంలో చేపలతో వెళ్తున్న వాహనాన్ని ఫారెస్టు అధికారులు పట్టుకుని ఆ తర్వాత ఫిషరీష్ డిపార్ట్‌మెంటుకు అప్పచెప్పారు. అంతేకాదు నెల్లూరు రోడ్డులో రెండు చోట్ల చెక్‌పోస్టులు ఉన్నా కూడా ఈ చేపల వాహనాలు తిరుగుతుండడం గమనార్హం. బద్వేలు, కడప ప్రాంతాలో సుమారు 20 మంది చేపల వేటగాళ్ల వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం.

అడ్డూ అదుపు లేకుండా...

చేపల మాఫియా రోజు టన్ను పెద్దసైజు చేపలు వేటాడితే. చిన్నచేపలు మరో టన్ను వరకు వేటాడుతున్నారు. ఇవి రెండు లక్షల రూపాయల మేరకు విలువ చేస్తాయని చెప్పుకొచ్చారు. పెద్ద చేపలను కడప, కేరళ, కొలకత్తాలకు తరలిస్తుండగా ఎండు చేపలను అక్కడే ఎండబెట్టి విజయవాడకు తరలిస్తున్నారు. ఒక కేజీ ఎండు చేపలు రూ.130 ప్రకారం, పచ్చి చేపలు అయితే 70 నుంచి 80 రూపాయల వరకు వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అడ్డు, అదుపు లేకుండా వేట సాగిస్తుండడంతో సోమశిల మత్స్యసంపద మటుమాయం అయ్యే పరిస్థితి నెలకొంది.

కొరవడిన నిఘా

రిజర్వ్ ఫారెస్టులోకి అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించకూడదు. రెవెన్యూ అనుమతి లేకుండా వాహనాలూ వెళ్లకూడదు. అయితే రిజర్వ్ ఫారెస్టు నుంచే చేపల వాహనాలు తిరుగుతున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో చేపల వేటమాటున ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడ్డ పరిస్థితులు జిల్లాలో కనిపించాయి. ఇప్పటికైనా ఫారెస్టు, మత్స్య, రెవెన్యూ అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

అనుమతులు లేకుంటే చర్యలు

సోమశిల ప్రాజెక్టులో చేపలు పట్టి వాహనాల ద్వారా అటవీ ప్రాతంలో అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. వారం రోజుల క్రితం అనుమతులు లేకుండా చేపల లోడుతో వెళుతున్న ఆల్విన్ వాహనాన్ని మత్స్యశాఖాధికారులకు అప్పచెప్పాం. అనుమతి లేకుండా ఫారెస్టులో వాహనాలు వెళితే వాటిని పట్టుకుని సీజ్ చేస్తాం

-నయీం అలీ, ఫారెస్ట్ రేంజర్, బద్వేలు

లైసెన్స్ ఉన్నవారే చేపలు పట్టాలి

లైసెన్స్ ఉన్నవారే చేపలను వేటాడాలి. లైసెన్స్‌లు లేకుండా ఇతర ప్రాంతాలనుంచి వచ్చి చేపలు వేటాడితే చర్యలు చేపడతాం. సోమశిల ప్రాజెక్టులో వారం రోజుల క్రితం ఆకస్మిక తనిఖీలు చేపట్టాం. తాత్కాలికంగా ఉన్న గుడిసెలు తొలగించాం. కోస్తా నుంచి చేపలను వేటాడేందుకు వచ్చిన వారిని పంపించాం. నిషేధిత వలలతో చేపలు వేటాడితే చర్యలు తప్పవు.

-బాలరాజు, మత్స్యశాఖ డెవలప్‌మెంట్ అధికారి

కేజీసెట్ ఫలితాలు విడుదల



కేజీసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న కేఎస్‌ఆర్‌ఎం ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి(నాని), రాజేశ్వరమ్మ

సీకేదిన్నె, మే 30 (ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్‌ఎం, కేఎల్‌ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కేజీసెట్ 2౦25 ఫలితాలు విడుదల చేసినట్లు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి(నాని) తెలిపారు. గత అయిదు సంవత్సరాలుగా విజయవంతంగా కేజీసెట్‌ను నిర్వహిస్తున్నామని, ఈనెల 1, 2 తేదీల్లో నిర్వహించిన కేజీసెట్‌కు 2,223 మంది హాజరుకాగా 1719 మంది అర్హత సాధించారన్నారు. కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం సరైన విద్యావకాశాలు లేని గ్రామీణ విద్యార్థులను గుర్తించి వారి ఆశయాలను సాధించుకునేందుకు విద్యార్థుల ప్రతిభను గుర్తించి విద్యాసంస్థలలో ప్రవేశం పొందే అవకాశం, స్కాలర్‌షిప్ అందించడం సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గత నాలుగు సంవత్సరాలకు 12 వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారికి రూ.40లక్షలు విలువైన ఉచిత విద్య, వసతి, రవాణా, స్కాలర్‌షిప్‌లు అందజేశామన్నారు. కేజీసెట్ ద్వారా ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్‌ల రూపంలో ప్రతి సంవత్సరం 3500 నుంచి రూ.10వేల వరకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, కేఎల్‌ఎం ప్రిన్సిపాల్ ఎంవీ రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. పార్వతీపరమేశ్వరుల కల్యాణం



ప్రొద్దుటూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం ఉదయం అమృతేశ్వరస్వామికి ద్వాదశ జ్యోతిర్లింగ అష్టాదశ శక్తిపీఠాలు, నవరత్న లింగానికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీలను చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శనివారం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, చండీహోమాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి నామా నాగశ్రీనివాసులు, టీటీడీ మాజీ సభ్యుడు టంగుటూరి మారుతీప్రసాద్, తల్లం కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు మృతి



ఘటన స్థలంలో మృతి చెందిన ఆటో డ్రైవర్, శ్రీనివాసులు (ఫైల్)

కడప క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం సమీపంలో ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. సిద్దవటం మండలం వస్‌మాధవరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన పెయ్యల శ్రీనివాసులు (40) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవారు. రోజులాగే ఆటోలో కడపకు వచ్చి తిరిగి మాధవరం వెళుతున్నాడు. సబ్‌జైలుకు దగ్గరలోని సైనిక్ నగర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా ఆటోను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడిక క్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమ్మితం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ పైనుంచి కిందపడి వ్యక్తి..



శివసాయి మృతదేహం

ఎర్రగుంట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలోని దొండపాడు రస్తాలో ఉన్న జియో సెల్ టవర్ పైనుంచి కిందపడి రిగ్గర్‌గా పని చేస్తున్న ముద్ది శివసాయి (25) శుక్రవారం మృతి చెందాడు. వేంపల్లి మండలం అలిరెడ్డి పల్లెకు చెందిన శివసాయి సెల్‌టవర్ మరమ్మతుల కోసం పైకి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాలుగు నెలల నుంచి నుంచి రిగ్గర్ (సెల్ టవర్ ఎక్కేపని)గా పనిచేస్తు న్నారు. శుక్రవారం ఉదయం టెక్నీషియన్ శేఖర్‌తో కలిసి సేఫ్టీ మెజర్స్‌తో సెల్ టవర్ ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే టవర్‌కు కొక్కీలు వేయడంలో పొరపాటు జరిగింది. దీంతో పైనుంచి కిందపడటంతో మృతి చెందాడు. ఎస్ఐ నాగమురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువతిపై కత్తితో దాడి.. కేసు నమోదు

ముద్దనూరు మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామానికి చెందిన హరిణి అనే యువతిపై కత్తితో దాడికి పాల్పడినక్రాంతికుమార్‌పై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐదస్తగిరి తెలిపారు. కడపలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో హరిణి బీటెక్ చదువుతుండగా.. అన్నమయ్య జిల్లా గాలివీడుమండలం కొప్పలవారిపల్లెకు చెందిన కాంత్రికుమార్ అసిస్టెంట్‌ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేసేవాడు. వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. కొద్ది నెలల తరువాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతోఫోన్‌లో వేధిస్తుండేవాడు. తరువాత కాంత్రికుమార్‌కు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. హరిణి బీటెక్ పూర్తి చేసుకొని సాఫ్ట్‌వేరు ఉద్యోగం రావడంతో బెంగళూరు వెళ్లింది. అయితే ఆమె సోదరి వద్ద ఉండి ఉద్యోగానికి వెళుతుండేది. దీంతో తన వద్దకు రావాలని వేధిస్తుండేవాడు. ఈ ఏడాది జనవరిలో బెంగులూరులో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ క్రాంతి కుమార్ వేధింపులు ఆపకపోవడంతో నల్లబల్లెలోని ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేస్తోంది. అయితే యువతి అడ్రస్ తెలుసుకొని నేరుగా నల్లబల్లెలో ఇంటి వద్ద ఎవరూలేని సమయంలో వచ్చి యువతిని ఫోన్ నెంబర్ చెప్పాలని భయపెట్టి, కత్తితో దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

వైఎస్ విగ్రహాల ముసుగులో రాజకీయాలు మానుకోండి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, మే 30 (ఆంధ్రజ్యోతి): వైఎస్ విగ్రహాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం మానుకోవాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు ఘటనపై వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారన్నారు. వైఎస్ సతీమణి వైఎస్ విజయలక్ష్మి, ఆయన కుమార్తె వైఎస్ షర్మిల మీద జగన్ మాదిరి కేసులేమీ పెట్టలేదన్నారు. రాజశేఖర్‌రెడ్డి రాముడు అయితే వివేకానందరెడ్డి లక్ష్మణుడిగా ఉండేవారన్నారు. లక్ష్మణుడి లాంటి వివేకానందరెడ్డిని చంపామని అభియోగాలు ఎదుర్కోలేదన్నారు. అలాగే ఓ కోయిల తొందరపడి ముందే కూసింది అన్న విధంగా వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతున్నారు. మహానాడు అయిపోక ముందే అక్కడ ఏమీ జరగలేదని మాట్లాడడం విడ్డూరమన్నారు. స్టీల్ ప్లాంట్‌ను పది రోజుల్లో మొదలుపెడతాం, జీఎన్ఎస్ ఎస్‌కు రూ.1000కోట్లు ఇస్తాం, గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు రూ.80వేల కోట్లతో చేస్తాం లాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తామని చంద్ర బాబునాయుడు వరాలు ప్రకటించారన్నారు. అయితే అవినాశ్‌రెడ్డి మహానాడు అంతా ఆత్మస్తుతిపరనింద అని మాట్లాడటం అవివేకానికి నిదర్శమన్నారు.

స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామనడం హర్షణీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్టీల్ ప్లాంట్ పనులు పది రోజుల్లో ప్రారంభిస్తామని మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావించిన ప్పటి నుంచి కడప జిల్లాలో మొట్టమొదటిసారి మహానాడు నిర్వహించి రాష్ట్రంలోనే కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేశామన్నారు. కడప మోడల్‌ను ఇప్పటి నుంచి గీటురాయిగా మార్చామన్నారు. జిల్లాలో మహానాడును విజయవంతం చేయడంలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు కార్యకర్తల పాత్ర మరువలేనిదన్నారు. మహానాడు మూడు రోజులు అద్భుతంగా జరగడంపై సీఎం చంద్రబాబునాయుడుతో పాటు పార్టీ నాయకత్వం అంతా సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. మహానాడు విజయవంతంతో కడప జిల్లాలో టీడీపీ ఎంత బలంగా వుందో సత్తా చాటినట్లయిందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, టీడీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్, నిమ్మకాయల మున్నా తదితరులు పాల్గొన్నారు.

బద్వేలుకు ముఖ్యమంత్రి వరాల జల్లు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): కడప గడపలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బద్వేలుకు వరాల జల్లు కురిపించారని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ కుమార్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం రాత్రి టీడీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల మండలాలకు తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా నీరందించడంతో పాటు అట్లూరు, గోపవరం, బద్వేలు ప్రాంతాలకు సోమశిల వెనుకజలాల నుంచి చెరువులకు నీరు నింపేందుకు జీవో జారీచేయడం హర్షణీయమన్నారు. రూ.3560 కోట్లతో బద్వేలు టు కృష్ణపట్నం నాలుగులేన్ల రహదారి పనులను పూర్తి చేసేందుకు, బద్వేలు మున్సిపాలిటీకి అమృత్ పథకం కింద రూ.120 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు న్నామన్నారు. మహానాడు కార్యక్రమానికి అంచనాలకు మించి జనం హాజరు కావడం తెలుగుదేశం పార్టీపై చూపిస్తున్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఇందుకోసం కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. బద్వేలు నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా పునరావృతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఉత్సాహంగా సాగిన పసిడిపురి వసంతోత్సవం



చిన్నారులకు మెమొంటోలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పసిడిపురి వసంతోత్సవం ఉత్సాహంగా సాగింది. శుక్రవారం ప్రొద్దుటూరు, కడప, రాజంపేట, వేంపల్లె ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వంద మంది చిన్నారులు తమ నాట్య నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మొహిద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ భారత సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ప్రొద్దుటూరు పసిడిపురి వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించామన్నారు. అనేక కళల్లో నాట్యం ఒక కళ అని, నేడు నాట్య ప్రాముఖ్యను గుర్తించి పిల్లలకు సాంప్రదాయ నృత్యాలను నేర్పించి ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు కూచిపూడి, జానపద, భరతనాట్యం, సంగీతం, సినీ క్లాసికల్, సోలో గ్రూప్ విభాగాల్లో నృత్యాలను ప్రదర్శించారు. ప్రతిభ కనపరిచినవారికి అయోధ్య బాల రామ అవార్డులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. నాట్య గురువులకు నాట్య పతంస అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు, చిన్నారులు, నాట్య గురువులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం హరి టవర్స్‌లో జిల్లా బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, జనరల్ సెక్రటరీ గంధం ప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకరించడం అభినందనీయమన్నారు. వంద అడుగుల విగ్రహం ఏర్పాటుకు త్వరితగతిన పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించామన్నారు. కార్యక్రమంలో బండి బాబు, కృష్ణమూర్తి, తుమ్మల కుంట ఈశ్వరయ్య, పుత్త రాజు, సన్నిదానం, సాయి పాల్గొన్నారు.

మహాభారతానికి రూ.ఒక లక్షా 50 వేలు విరాళం

చిన్నమండెం, మే30(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలం కొత్తపల్లి కస్పాలో జరిగే మహాభారతానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత, మౌర్యారెడ్డి శుక్రవారం రూ.ఒక లక్షా 50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని మహాభారతం నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు భోజన వసతులు, మంచి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

● మదనపల్లి ఎమ్మెల్యే: షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే షా.జహాన్‌బాషా సూచించారు. శుక్రవారం ఎంపీడీవో తాజ్ మస్రూర్ అధ్యర్యంలో నిర్వహించిన మండల సర్వ సభ్యసమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొందరు అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరుకు సరైన కారణం చూపని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. టమోటా రైతుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ప్రశ్నించారు. కోళ్లబైలులో ప్రభుత్వ భూములపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. పట్టణం చుట్టుపక్కల వున్న గ్రామ పంచాయతీల్లో వేస్తున్న లే అవుట్లలో తప్పని సరిగా 33 అడుగుల రోడ్లు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశానికి 18 మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, ఒక టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే వైసీపీ ఎంపీటీసీ సభ్యులు సమోసాలు, స్వీట్లు తినేసి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, తహసీల్దార్ ధనంజయులు, వైఎస్ ఎంపీపీ రమణ, అధికారులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన డాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సేవాలోపంపై ఆగ్రహం

మదనపల్లె అర్బన్ :స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సేవలను సక్రమంగా అందివ్వలేదని సిబ్బందిపై ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆగ్రహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ల కొరత పర్యవేక్షణ లోపంతో ఆస్పత్రి భ్రష్టుపట్టిపోయిందని మండిపడ్డారు. మృత దేహాలు భద్రపరిచేందుకు ఫ్రీజర్‌బాక్స్ కూడా లేకపోవడం దారుణమన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర విభాగంలో ఇద్దరు డాక్టర్లను అపాయింట్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఫ్రీజర్‌బాక్సులు వితరణ చేస్తామని మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మదనపల్లె ఆర్యవైశ్య సంఘం, వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల, దత్తా ఆగ్రో ఏజన్సీ ప్రొప్రైటర్ శ్రీనివాసమూర్తి ప్రకటించారు. ఆస్పత్రిలో ఏమైనా అవసరాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ నాయకులు షంషీర్, జునైద్ అక్బరీ, బిల్లే రెడ్డి ప్రసాద్, దుబ్బిగాళ్ల భాస్కర్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జాన్‌బాబు, ఆర్‌కే రామకృష్ణ, మురళీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి, ఆర్‌ఎంవో షకూర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు

మహానాడుకు తరలి వచ్చిన కార్యకర్తలకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధన్యవాదాలు తెలిపారు. మదనపల్లె నుంచి 10వేల మందికి పైగా కార్యకర్తలు, నాయకులు వచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, ఆర్‌కే రామకృష్ణాచారి, ఎస్‌ఏ మస్తాన్, బాలుస్వామి, నాదెళ్ల శివన్న, షంషీర్, సుధాకర్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్, విజయకుమార్‌గౌడు, రాజన్న, నవీన్ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీకి సన్మానం



మధుసూదన్‌తో పోతుల సాయినాథ్

ములకలచెరువు, మే30 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ కలిశారు. శుక్రవారం మదనపల్లెలో పర్యటించిన ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షోరూం సూరి తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు




బోరుకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

కలకడ, మే 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ ఎల్లంకివారిపల్లె దళితవాడలోని బోరుకు అధికారులు మరమ్మతులు చేయించారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం దళితవాడలో తాగునీటి సమస్య అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎంపీడీవో అబ్దుల్ రహీం, కార్యదర్శి మునిరాజ బోరు మోటర్‌ను రిపేరు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు.

శబాష్.. మధుబాబు

● మహానాడులో విధుల నిర్వహణపై సీఎం ప్రశంస



మధుబాబును అభినందిస్తున్న చంద్రబాబునాయుడు

మదనపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): మహానాడులో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొంట మధుబాబును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. మహానాడుకు వచ్చిన శ్రేణులకు, కార్యకర్తలకు వంటల నిర్వహణ బాధ్యతను పార్టీ అప్పగించింది. మధుబాబుకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించినందుకు గానూ మహానాడులో చంద్రబాబు అభినందనలు తెలిపారు.

వేరుశనగ విత్తనాలు సిద్ధం

పెద్దతిప్పసముద్రం, మే 30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రైతు సేవా కేంద్రాలకు శుక్రవారం సబ్సిడీ వేరుశనగ కాయలు చేరినట్లు వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ మండలంలోని రంగసముద్రం, తుమ్మలకుంట, బూర్లపల్లి, పీటీఎం రైతు సేవా కేంద్రాలకు 15 వందల క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం 30 కిలోల బస్తా సబ్సిడీ ధర రూ. 1674గా నిర్ణయించినట్లు తెలిపారు. మండలానికి అవసరమైనన్ని కాయలు పూర్తి స్థాయిలో సరఫరా అయిన తరవాత ఉన్నతాధికారులు పంపిణీ తేదీలు ఖరారు చేస్తారని తెలిపారు.

చంద్రబాబుతో డీలర్ల వ్యవస్థకు పునరుజ్జీవం

● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పౌరసరఫరాల వ్యవస్థను జగన్ సర్వనాశనం చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాణం పోశాడని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి వచ్చే నెల 1వ తేదీ నుంచి చౌకదుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల డీలర్లు శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి పంపిణీ బాధ్యతను డీలర్లకు అప్పగించారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీలర్లు జయచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా టీడీపీ కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, దూలం నీలకంఠారెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రియాజ్, శివారెడ్డి, అహమ్మద్‌బాషా, నాయకులు అనిల్‌కుమార్, వేమ నారాయణ,నరసింహులు, ఎస్‌ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50లక్షలు విరాళం

ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో వచ్చే నెల 1వ తేదీన జరిగే పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు తంబళ్లపల్లె ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనరెడ్డి రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ నగదును వేడుకల నిర్వాహకులకు అందజేశారు. కాగా జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనరెడ్డిలు ఇద్దరూ ఈ పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదివారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాస్టర్ శ్రీనివాసులు, దూలం నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు త్వరలో రెండు కొత్త బస్సు సర్వీసులు



పీలేరు డిపోలో కార్మికులు, ఉద్యోగులతో డీపీటీవో రాము

పీలేరు, మే 30(ఆంధ్రజ్యోతి): పీలేరు నుంచి బెంగళూరుకు త్వరలో మరో రెండు కొత్త సర్వీసులు ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి(డీపీటీవో) రాము తెలిపారు. పీలేరు డిపోను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు పీలేరు ఆర్టీసీ బస్టాండు నుంచి యలహంక మార్గంలో బెంగళూరుకు ఒక సర్వీసు బయలుదేరుతుందని, తిరిగి అది ఉదయం 10 గంటలకు మెజిస్టిక్ నుంచి బయలుదేరి అదే మార్గంలో పీలేరుకు చేరుకుంటుందన్నారు. మరో బస్సు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు పీలేరు నుంచి బెంగళూరుకు బయలుదేరుతుందని, సాయంత్రం 6 గంటలకు బెంగళూరులోని మెజిస్టిక్ నుంచి బయలుదేరి రాత్రి 10.30 గంటలకు పీలేరుకు చేరుకుంటుందన్నారు. ఈ రెండు సర్వీసులకు అనుమతులు అందిన వెంటనే ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో నెలవారీగా తమ సంస్థ టోల్‌ప్లాజాలకు రూ.37,68,550లు చెల్లిస్తోందన్నారు. ఓఆర్ సాధనలో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో 18వ స్థానంలో ఉందన్నారు. ఈ నెల 29 నాటికి నెలవారీ ఈపీకే 39.74 శాతం ఉందన్నారు. పల్లెవెలుగు సర్వీసులు నడపడానికి ఒక్కొక్క బస్సుకు రోజువారీ రూ.27 వేలు ఖర్చు వస్తుండగా ఒక్కో సర్వీసు మీద ఆదాయం కేవలం రూ.18 వేలు మాత్రమే వస్తోందన్నారు. అదే ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రోజువారీ ఖర్చు రూ.24 వేలు కాగా దానిపై రూ.25 వేలు ఆదాయం వస్తోందన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన పీలేరు డిపోలోని పలు బస్సుల కండిషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎం నిర్మల, సీఐ సుబ్బమ్మ, ఎంఎఫ్ హరినాథరెడ్డి, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగుతో లాభసాటి వ్యవసాయం

● సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు
● వేరుశనగలో విత్తనశుద్ధి తప్పనిసరి
● ఖరీఫ్‌లో వేరుశనగ, ఉలవల సాగుపై అవగాహన
● 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'లో శాస్త్రవేత్తలు



బి.కొత్తకోట: బయప్పగారిపల్లి వద్ద రైతుతో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పీలేరు రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) నాణ్యమైన ఉత్పత్తుల సాగుపై రైతులు ప్రత్యేక చొరవ చూపాలని తిరుపతి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం పీలేరు మండలం తలపుల పంచాయతీ పరిధిలోని రెడ్డెన్నగారి పల్లెలో కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రైతులు భూవనరులు, ఆరోగ్యం పరిరక్షించాలని సూచించారు. రసాయన ఎరువులు ఎడాపెడా వాడడం వల్ల భూసారంతోపాటు, మనుషుల ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ లాభసాటి పంటల సాగుపై రైతులు మక్కువ చూపాలని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల కోసం ఆవు పేడ, మూత్రం, ఆకులు తదితర ప్రకృతి సహజసిద్ధమైన వాటిని వాడాలని సూచించారు. రోజురోజుకూ ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు.పీలేరు వ్యవసాయ సహాయ సంచాలకులు వై.వీ. రమణరావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ, ఉలవల సాగుపై రైతులకు పలు సూచనలిచ్చారు. ఖరీఫ్‌కు రైతులు సమాయత్తం కావాలని సూచించారు. ఖరీఫ్ సాగు జూన్ 15వ తేదీ నుంచి జూలై 15 వరకూ వేరుశనగ, ఇతర పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. ముందుగా వర్షాలు పడితే పది రోజులు ముందే విత్తనాలు వేసుకోవచ్చునని సూచించారు. ఈ సమావేశంలో కలికిరి కేవీకే సమన్వయ కర్త డాక్టర్ కే. మంజుల, పీలేరు హార్టికల్చర్ అధికారి సుకుమార్ రెడ్డి, ఏవో రమాదేవి పాల్గొన్నారు.

బి.కొత్తకోట : సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. మాధురి, డా.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం బయప్పగారిపల్లి, కోటావూరు పంచాయతీలలోని పలు పంటలను పరిశీలించి, ఆయా రైతులతో మాట్లాడారు. కేవలం టమోటాపై ఆధారపడి నష్టపోకుండా పంటమార్పిడి చేయా లన్నారు. వేరుకుళ్లు నివారణకు ట్రైకోడెర్మావిరిడి అనే జీవశిలీంధ్రనాశినిని వినియోగించాలన్నారు. వ్యవశాయ, ఉద్యానశాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకో వాలని, శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సల హాలను రైతులు పాటించాలని కోరారు. కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతుల సంక్షే మం, లాభాల కోసం చేపడుతున్న కార్యక్రమా లను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి భీమేశ్, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ: విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చునని తిరుపతి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కదిరాయచెరువులో ఖరీఫ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో తుంగ కలుపు నివారణకు ఎకరానికి హైక్లోసాల్ 12 గ్రాముల ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కిసాన్ డ్రోన్‌ను వాడేవిధానం, ఉపయోగాలు వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. ఎంఈవో లావణ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కాలేజి అధ్యాపకులు మామిడిలో పండు ఈగ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్, రైతులు కమలనాథ్, విశ్వనాథ్‌శెట్టి, గోపాల్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు పూజలు

మదనపల్లె అర్బన్, మే30(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలోని కోర్టులో గంగమ్మకు శుక్రవారం పూజలు నిర్వహించారు. మహిళలు రాహుకాల సమయంలో నైవేద్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు అనంతరం నిమ్మకాలయపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్న రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

మదనపల్లె అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): కురబల కోట మండలం, అంగళ్లు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటికి చెందిన ఒకరు మృతి చెందగా నలుగురు గాయాలపాలయ్యారు. బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లె ఇన్‌చారి జయచంద్రారెడ్డి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. . కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీడ్స్ మల్లికార్జున నాయుడు, పఠాన్ ఖాదర్ ఖాన్, ముబారక్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వారపుసంతలో అక్రమ నిర్మాణాలు తొలగించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పునీత్‌కుమార్

మదనపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతలో అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని బహుజన యువసేన(బీవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పునీత్‌కుమార్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి కేటాయించిన వారపుసంతలో వ్యాపారులు, దళారులు శాశ్వత నిర్మాణాలు చేపట్టడాన్ని తప్పుపట్టారు. కొందరైతే షెడ్లు నిర్మించి, బాడుగలకు కూడా ఇచ్చారని, ఇది మున్సిపల్ నిబంధనలకు విరుద్ధం కాదా? అని కమిషనర్‌ను ప్రశ్నించారు. అలాగే రైతుల నుంచి గేటు కూడా ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. గతంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని అప్పటి సబ్‌కలెక్టర్ ఆదేశించారని, అయితే ఇది ఇప్పటికీ అమలు కాలేదన్నారు. వీటిపై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకుడు శ్రీనివాసులు, హరికృష్ణ, జిలానీ, శ్రీనివాసులు, శశికుమార్, వినయ్, నితీశ్, బ్రహ్మ, నిజాంబాషా, బాలకృష్ణ, శశి, గౌతమ్, రాజేష్, దేవేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పక్కాగా నిర్వహించాలి



తంబళ్లపల్లెలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు హరికుమార్

తంబళ్లపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల్లో రేషన్ పంపిణీ పక్కాగా నిర్వహించాలని తహసీల్దారు హరికుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 39 షాపులను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. తహసీల్దారు, సీఎస్‌డీటీ భువనేశ్వరీ, ఈడీటీ మౌలాలి మూడు బృందాలుగా వేర్వేరుగా రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఒక్కో షాపులో ఉన్న కార్డుదారుల సంఖ్య, ఈ పాస్ యంత్రం లైసెన్స్, ఆథరైజేషన్, వేయింగ్ మిషన్ల పనితీరు, తూనికలు, స్టాకు బోర్డులో తెలిపిన వివరాల మేరకు సరుకుల నిల్వలు తదితర అంశాలను పరిశీలించారు. డీలర్లు జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులను కార్డుదారులకు అందించాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందచేయాలని, నిత్యావసర సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సిబ్బంది ఉన్నారు.

రేషన్ డీలర్లు పనివేళలు పాటించాలి

గుర్రంకొండ: పనివేళలు పాటిస్తూ ప్రజలకు సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రేషన్‌డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ నుంచి ఎండీయూ వాహనాలను ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఇక నుంచి రేషన్ డీలర్లే సరుకులు సరఫరా చేస్తారన్నారు. డీలర్లు సకాలంలో దుకాణాలను తెరవాలని, ప్రభుత్వం సరఫరా చేసే సరుకులను మాత్రమే పంపిణీ చేయాలన్నారు. కార్డుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ బాబాజాన్, రేషన్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లుండి పండుగ వాతావరణం లో బియ్యం పంపిణీ

పెద్దమండ్యం: మండలంలోని ప్రభుత్వ చౌకదుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 29 ప్రభుత్వ చౌక దుకాణాల పరిధిలో 11315 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. జూన్ 1న అన్ని రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డీలర్లు రేషన్‌కార్డుదారులకు సకాలంలో బియ్యం పంపిణీ చేయాలన్నారు. కీ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలన్నారు. వృద్ధ దంపతులకు ఇళ్ల వద్దే రేషన్ బియ్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్లు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వం కిట్లు పంపిణీ



సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ చేస్తున్న శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆ పార్టీ స్థానిక నేత శ్రీరామ రామాంజనేయులు అన్నారు. మదనపల్లె మండలం సీటీఎం, కొత్తవారిపల్లెలో శుక్రవారం జనసేన నేతలు 200 పైగా కుటుంబాలకు సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిట్ల పంపిణీ ఒక యజ్ఞంలా మొదలై లక్షల సంఖ్యకు చేరుకుందని, వీటిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు చేర్చే బాధ్యత వలంటీర్లు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు చిన్నా రెడ్డి, గంగాధర్, రామ్మూర్తి, అశోక్, గురు, జాబీర్, వసీం, సంతోష్, మహేష్, బబ్లూ, గౌతమ్, వెంకటేష్, వినయ్, వరుణ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి..

వాల్మీకిపురం, మే 30(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల నగదు బదిలీల కోసం బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం, ఎన్‌పీసీఐ లింక్ ప్రతి ఒక్కరూ చేసుకోవాలని తిరుపతి పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ నరసప్ప తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పోస్టల్ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంకు ఖాతాకు జమ చేయడానికి ఆధార్‌కు బ్యాంకు ఖాతా మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. జూన్ 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి



ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మదనపల్లె టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానిక ఎంఈవో ప్రభాకరరెడ్డిని కలసిన జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ మదనపల్లె పట్టణంతో పాటు, మండలంలోని పలు ప్రైవేటు విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్న ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయల ఫీజులు, పాఠ్యపుస్తకాల కోసం అధనంగా రూ.16వేలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యా వ్యాపారంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అఫ్రీద్, జయబాబు, సమీర్, అఖిల్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించాలి



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించాలని ఏఐటీయూసీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమకు కేటాయించిన క్వార్టర్లకు తమ వేతనం నుంచి అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఆప్కాస్ కార్మికుల ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ఇంటి స్థలాల పట్టాలను ఇవ్వా లని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పట్టణ కార్యదర్శి తిరుమల, కృష్ణప్ప, జానకి, దేవా, సంజీవ, వాసు, చంద్ర, ఇంద్రాణి, రాధా, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి హత్యకేసు నిందితులను శిక్షించండి



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నేత మైఫోర్స్ మహేశ్

మదనపల్లె, మే 30(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైలవరంలో ఇటీవల జరిగిన చిన్నారి హత్యకేసు నిందితుల్ని కఠినంగా శిక్షించాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేశ్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు, పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించాలని సూచించారు. బాధిత కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. జనసేన లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అమరనారాయణ మాట్లాడుతూ ఇలాంటి కేసుల్లో స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేసి తప్పుచేయాలనే ఆలోచన రాకుండా తీర్పులు ఇవ్వాలని సూచించారు. పార్టీ నాయకురాలు మాలతి, భవ్య, శోభ, సందీప్‌రెడ్డి, రామ్మూర్తి, చిరంజీవి, రమణ, శేషగిరి, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం టీడీపీలో జోష్

పెద్దమండ్యం, మే 30(ఆంధ్రజ్యోతి): మహానాడుతో పెద్దమండ్యం మండల టీడీపీలో జోష్ పెరిగిందని టీడీపీ యువనేతలు బీటెక్ సుమన్, సిద్దవరం ప్రసాద్ తెలిపారు. పెద్దమండ్యంలో శుక్రవారం కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దమండ్యం మండలంలో టీడీపీ చరిత్రలో 34 బస్సులతో పాటు వివిధ వాహనాల్లో మహానాడుకు 2 వేల మంది కార్యకర్తలు తరలిపోవడం విశేషమన్నారు. పెద్దమండ్యం, పాపేపల్లి, సిద్దవరం, ఎన్‌వోపల్లి, దిగువపల్లి, మండలవారిపల్లి, బండమీదపపల్లి, శివపురం, సి.గొల్లపల్లి, వెలిగల్లు తదితర గ్రామ పంచాయతీల నుంచి కార్యకర్తలు,నేతలుహాజరయ్యారన్నారు. మండల టీడీపీ నేతలు మేకల చలపతి, ప్రసాద్, ఇస్మాయిల్, చంద్రారెడ్డి, బాబ్‌జాన్, చలపతినాయుడు, సుబ్బయ్య, ఫరూక్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.